


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 19-02-2023 సంపుటి : 04 సంచిక : 155 పేజీలు : 4 వెల : రూ 3-00


## ఏపీలో కేబినెట్ విస్తరణ ఊహాగానాలు

విజయవాడ, ఫిబ్రవరి 18, ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి తన మంత్రి వర్గ టీమ్‌ను మార్చుకునే ప్రయత్నంలో ఉన్నారని వైఎస్ఆర్‌సీపీలో జోరుగా చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఎనిమిది స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులను ఎంపిక చేయడానికి కసరత్తు నిర్వహిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ నుంచి చేరిన జయమంగళ వెంకటరమణకు ఓ ఎమ్మెల్సీ స్థానాన్ని ఖరారు చేశారు మరో ఏడు స్థానాలకు అభ్యర్థుల్ని సామాజిక వర్గాల సమతూకంతో నిర్ణయించే కసరత్తు చేస్తున్నారు. ఈ సారి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యే వారికి వెంటనే మంత్రి పదవులు కూడా ఇచ్చే అవకాశాలున్నట్లుగా తెలుస్తోంది. కనీసం నలుగురు మంత్రులకు ఉద్వాసన పలికి కొత్త వారిని తీసుకోవాలని జగన్ అనుకుంటున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. సీఎం జగన్ మొదట ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడు ఆయన కేబినెట్‌లో ఇద్దరు ఎమ్మెల్సీలు మంత్రులుగా ఉండేవారు. మోపిదేవి వెంకటరమణ, పిల్లిసుభాష్ చంద్రబోస్ ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ వారిని మంత్రుల్ని చేసి తర్వాత ఎమ్మెల్సీలుగా చాన్సిచ్చారు. అయితే రాజధాని వివాదంతో తర్వాత మండలిని రద్దు చేయాలని నిర్ణయించుకున్న తర్వాత వారిని పదవుల నుంచి తప్పించి రాజ్యసభ సీట్లు కేటాయించారు. ఆ స్థానంలో ఎమ్మెల్యేలనే తీసుకున్నారు. అయితే ఇప్పుడు మండలిని రద్దు చేయకూడదని నిర్ణయించుకున్నారు. గతంలో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకున్నారు. ఇప్పుడు మండలిలో పూర్తి స్థాయిలో ఆధిపత్యం వైఎస్ఆర్సీపీకే ఉంది. అందుకే పార్టీ కోసం పని చేసిన వారికి మండలిలో సభ్యత్వం ఇచ్చి మంత్రి పదవులు ఇవ్వాలన్న ఆలోచనకు సీఎం జగన్ వచ్చారని చెబుతున్నారు.ఓ సందర్భంలో సీఎం జగన్ సతీమణి భారతిపై టీడీపీ నేతలు తీవ్ర విమర్శలు చేస్తున్న సమయంలో మంత్రులు స్పందించడం లేదంటూ.. కేబినెట్ సమావేశంలోనే సీఎం జగన్ కొంత మంది మంత్రులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ముగ్గురు, నలుగురు మంత్రుల్ని తప్పిస్తానని అప్పట్లోనే చెప్పినట్లుగా ప్రచారం జరిగింది. అయితే మంత్రులు తర్వాత ఎగ్రెసివ్ గా మారడంతో మళ్లీ అలాంటి వార్తలు రాలేదు. కానీ సీఎం జగన్ కేబినెట్ పునర్వ్యవస్థీకరణ పై గట్టి ఆలోచనతోనే ఉన్నారని తాజాగా స్పష్టమవుతోంది. గతంలోనే ముగ్గురు మంత్రులను మంత్రి వర్గం నుండి తప్పించే అవకాశం ఉంది.మంత్రి పదవిని కోల్పోయే మంత్రుల్లో ఒక మహిళా మంత్రి కూడా ఉన్నారని చెప్పుకున్నారు. కొత్త మంత్రుల్లో కొంత మంది తీరు వివాదాస్పదంగా మారింది. దూకుడుగా స్పందించలేకపోవడంతో పాటు వివాదాస్పదంగా వ్యవహరిస్తున్నారు. ఐటీ, పరిశ్రమల మంత్రిగా గుడివాడ అమర్నాథ్ ప్రకటనలు ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే విధంగా ఉంటున్నాయి. మరికొంత మంది మంత్రులపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. వారు చురుకుగా స్పందించడం లేదు కూడా . మంత్రి పదవుల నుంచి తప్పించినప్పటికీ ... కొడాలి నాని, పేర్ని నానిలే ఎక్కువగా పార్టీని డిఫెండ్ చేసుకుంటూ వస్తున్నారు. వారు కూడా ఇప్పుడు పదవులు ఆశిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇలాంటి సమీకరణాలను చూసుకుని కొత్తగా ఎమ్మెల్సీ స్థానాలను ఇచ్చే వారి నుంచి లేదా గతంలో హామీలు ఇచ్చిన వారికి పదవులు ఇచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. గత ఏడాది ఏప్రిల్ మాసంలో జగన్ కేబినెట్ మంత్రులంతా రాజీనామా చేశారు. ఏప్రిల్ 11న కొత్త కేబినెట్ ప్రమాణం చేసింది. 13 మంది కొత్తవారికి సీఎం జగన్ తన కేబినెట్ లో అవకాశం కల్పించారు. అంతకు ముందు కేబినెట్ లో పనిచేసిన 11 మందికి మరోసారి కేబినెట్ లో కొనసాగే అవకాశం కల్పించారు. గత కేబినెట్ లో పనిచేసిన వారిని పార్టీ అవసరాల కోసం వినియోగించుకుంటున్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల వరకు ఇదే కేబినెట్ ను కొనసాగించాలని జగన్ భావించారు. అయితే మంత్రుల పనితీరు ఇతర సమీకరణాలతో మళ్లీ మార్పులు చేస్తున్నారు.

## నెల్లూరు, సంగం బ్యారేజ్‌లకు ప్రతిష్టాత్మక సీబీఐపీ అవార్డు



అమరావతి: రాష్ట్రంలోని నెల్లూరు, సంగం బ్యారేజీలు ప్రతిష్టాత్మక సీబీఐపీ అవార్డుకు ఎంపికయ్యాయి. పెన్నా డెల్టా ఆధునికీకరణలో భాగంగా నెల్లూరు (0.4 టీఎంసీలు), సంగం బ్యారేజ్ (0.45 టీఎంసీలు)లను వైఎస్ జగన్ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసింది. యాజమాన్య పద్ధతుల ద్వారా నీటి వృథాకు అడ్డుకట్ట వేసింది. 4.22 లక్షల ఎకరాలకు సమర్థంగా నీటిని అందిస్తోంది.ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ.. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ (సీబీఐపీ) ప్రశంసించింది. అత్యుత్తమ ప్రాజెక్టులుగా నెల్లూరు, సంగం బ్యారేజ్‌లను ప్రకటించి సీబీఐపీ-2022 అవార్డుకు ఎంపిక చేసింది. ఈ అవార్డును మార్చి 3న సీబీఐపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్

**3న ఢిల్లీలో అవార్డును ప్రదానం చేయనున్న కేంద్ర మంత్రి ఆర్కే సింగ్**

**పెన్నా డెల్టా ఆధునికీకరణలో భాగంగా సంగం, నెల్లూరు బ్యారేజ్‌లను చేపట్టిన వైఎస్సార్**

**సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక యుద్ధప్రాతిపదికన ఆ రెండు బ్యారేజ్‌లు పూర్తి**

రాష్ట్ర అధికారులకు ప్రదానం చేయనున్నారు. సీబీఐపీ.. దేశంలో నీటివనరులు, విద్యుత్, సంప్రదాయేతర ఇంధన వనరుల విభాగంలో అత్యుత్తమ ప్రాజెక్టులను గుర్తించి అవార్డులను ప్రదానం చేస్తోంది.దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా పెన్నా డెల్టా ఆధునికీకరణ పనులను చేపట్టారు. నెల్లూరు, సంగం బ్యారేజ్‌ల నిర్మాణ పనులను చేపట్టారు. ఆయన హఠాన్మరణంతో ఆ బ్యారేజ్‌ల పనులకు గ్రహణం పట్టుకుంది. తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ సర్కార్ వీటిని పట్టించుకోలేదు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక.. కరోనా వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ.. ఆరి?థక ఇబ్బందులను అధిగమించి సంగం, నెల్లూరు బ్యారేజ్‌లను 2022, ఆగస్టు 31 నాటికి పూర్తి చేశారు.

## సీఎం జగన్ మహాశివరాత్రి శుభాకాంక్షలు

అమరావతి: తెలుగు రాష్ట్రాలు శివ నామస్మరణతో మార్మోగుతున్నాయి. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు పెద్దఎత్తున శివాలయాలకు పోటెత్తారు.జగాలను ఏలే జంగమ దేవుడు, తినేత్రుడు, లింగాకార రూపుడైన శివునికి ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఓం నమఃశివాయ, హరహర మహాదేవ శంభో శంకర అంటూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.మహాశివరాత్రి సందర్భంగా ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ‘‘సర్వ సృష్టికీ సంకేతంగా, స్థావర జంగమ సంగమ స్వరూపంగా, లింగమయ్యగా జంగమయ్యగా, శివునిగా భవునిగా సాంబశివునిగా, అనునిత్యం కొలుచుకుంటున్న పరమ శివుని పర్వదినం శ్రీకరం శుభకరం సకల మంగళకరం. పార్వతీ పరమేశ్వరుల శుభాశీస్సులు మనందరికీ అందాలని కోరుకుంటున్నాను” అని సీఎం జగన్ ట్వీట్ చేశారు.



## జగన్..షర్మిల పాదయాత్రలను ఏనాడూ తెదేపా అడ్డుకోలేదే: సోమిరెడ్డి



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రెడ్డి ప్రభుత్వానికి పోయేకాలం దగ్గరపడిందని తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ధ్వజమెత్తారు.జగ్గంపేట, పెద్దాపురంలో తెదేపా అధినేత చంద్రబాబు సభలకు వచ్చిన స్పందనను జీర్ణించుకోలేకనే అనపర్తిలో అడ్డంకులు సృష్టించారని దుయ్యబట్టారు. ప్రభుత్వానికి పోయేకాలం దగ్గరపడే ఇలాంటి అరాచకాలకు పాల్పడుతోందని విమర్శించారు.”ఏపీలో నియంతృత్వ, నిరంకుశ, దుర్మార్గపు పాలన కొనసాగుతోంది. సీఎం జగన్ రెడ్డి, ఆయన సోదరి షర్మిల, తల్లి విజయమ్మ పాదయాత్రలు చేసినా, కార్యక్రమాలు నిర్వహించుకున్నా ఏనాడూ అడ్డంకులు సృష్టించలేదు. రోడ్లపై అడ్డంగా నిలబడి పీకే రాసిచ్చిన పచ్చి అబద్ధాలు చెబుతున్నా తెదేపా హయాంలో పోలీసులు వారిని అడ్డుకున్నారా? నియంతపాలన సాగిస్తున్న జగన్ రెడ్డికి ప్రజలే గుణపాఠం చెప్పే రోజు దగ్గర పడింది. ఒక మాజీ ముఖ్యమంత్రి ప్రజలనుద్దేశించి మాట్లాడితే ఎందుకు అడ్డంకులు సృష్టిస్తున్నారు. ఏపీలో ప్రజస్వామ్యం చచ్చిపోయింది. రాష్ట్రంలో ప్రజలు ప్రజాస్వామ్యం కోసం మరో స్వాతంత్ర్య పోరాటం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇది చాలా బాధాకరం” అని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## సజ్జల డైరెక్షన్‌లోనే పోలీసుల అరాచకం: మండిపడ్డ చంద్రబాబు



అనపర్తి: తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో పోలీసుల దాడిలో గాయపడిన పార్టీ కార్యకర్తలను తెదేపా అధినేత చంద్రబాబు పరామర్శించారు.నిన్న పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో పలువురు తెదేపా కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించిన చంద్రబాబు.. పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యకర్తలు త్వరగా కోలుకోవాలని.. అక్రమ కేసులపై న్యాయబద్ధంగా పోరాడుదామని వారికి చంద్రబాబు ధైర్యం చెప్పారు.అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ.. ‘‘ప్రజల్లో వ్యతిరేకత గమనించే వైకాపా ప్రభుత్వం అరాచకాలకు పాల్పడుతోంది. నిన్న అనపర్తిలో పోలీసులను పురిగొల్పి పంపారు. ముందురోజు సభ నిర్వహణకు అనుమతి ఇచ్చి... అప్పటికప్పుడు అనుమతి లేదంటూ అరాచకం సృష్టించారు. జగ్గంపేట, పెద్దాపురంలో లేని ఆంక్షలు అనపర్తిలో ఎందుకొచ్చాయి. ప్రతిపక్షాలు నిర్వహించే సభలను అడ్డుకోవాలి.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోంది. చట్టవ్యతిరేకంగా పనిచేయాలని పోలీసులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి డైరెక్షన్‌లోనే కొంతమంది పోలీసులు అరాచకం సృష్టిస్తున్నారు. పోలీసులు కావాలనే తెదేపా కార్యకర్తలపై గురిపెట్టి దాడి చేశారు. కార్యకర్త ప్రకాశ్‌నాయుడిని గుండెలపై కొట్టడంతో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పోలీసులు సహకరించొద్దని కోరుతున్నాను. చట్టానికి అనుగుణంగా విధులు నిర్వర్తించాలి” అని చంద్రబాబు పోలీసులకు సూచించారు.

## ఢిల్లీ మేయర్ ఎన్నిక: సుప్రీం తీర్పుతో సస్పెన్స్‌కు తెర.. తేదీ ఖరారు

ఢిల్లీ: ఢిల్లీ మేయర్ ఎన్నిక తేదీపై కొనసాగుతున్న సస్పెన్స్‌కు తెర పడింది. ఎన్నిక తేదీ ఖరారు అయ్యింది. ఇప్పటికే మూడుసార్లు వాయిదా పడిన ఎన్నికకు..తాజా సుప్రీం కోర్టు తీర్పుతో మార్గం సుగమం అయ్యింది. ఈ మేరకు శనివారం మేయర్ ఎన్నిక నోటిఫికేషన్ రిలీజ్ చేసింది ఎంసీడీ కార్యనిర్వాహక విభాగం.ఫిబ్రవరి 22వ తేదీన ఢిల్లీ మేయర్ ఎన్నిక నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అదే రోజున మేయర్‌తో పాటు డిప్యూటీ మేయర్ ఎన్నిక కూడా నిర్వహిస్తారు. ఇదిలా ఉంటే శుక్రవారం సుప్రీం కోర్టులో, ఢిల్లీ మేయర్ ఎన్నికకు సంబంధించి వ్యవహారంలో ఆప్ భారీ విజయం సొంతం చేసుకుంది. లెఫ్టినెంట్ గవర్నర్ నామినేట్ చేసిన సభ్యులు ఓటేయడానికి వీల్లేదని, వాళ్లకు అర్హత లేదని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. అంతేకాదు.. ఎన్నికకు సంబంధించి నోటిఫికేషన్.. అదీ స్పష్టమైన తేదీతో వెంటనే రిలీజ్ చేయాలని ఆదేశించింది.ఈ నేపథ్యంలోనే ఇవాళ నోటిఫికేషన్ రిలీజ్ చేశారు ఎంసీడీ హెడ్. ఫిబ్రవరి 22వ తేదీన(బుధవారం) ఉదయం 11 గంటలకు ఎంసీడీ సదన్‌లో ఈ ఎన్నిక జరగనుంది. మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక తర్వాత.. ఆరుగురు సభ్యులుండే స్టాండింగ్ కమిటీని అదేరోజు ఎన్నుకుంటారు. ఎన్నికల ఫలితాలు వెలువడి రెండు నెలలు గడుస్తున్నా.. ఇంకా మేయర్ పదవికి ఎన్నిక జరగకపోవడం గమనార్హం.ఎన్నికల్లో ఆప్ విజయం సాధించగా.. బీజేపీ ఓటమి పాలైంది. అయితే మేయర్ పదవికి తొలుత పోటీ చేయమని ప్రకటించిన బీజేపీ.. అనూహ్యంగా చివరి నిమిషంలో అభ్యర్థులతో నామినేషన్ వేయించింది. ఆపై మూడుసార్లు మేయర్ ఎన్నిక కోసం హౌజ్ సమావేశం కాగా.. ఆప్-బీజేపీ సభ్యుల పరస్పర ఆరోపణలు.. అభ్యర్థుల ఆందోళనతో ఎన్నిక వాయిదా పడుతూ వచ్చింది. ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా సత్య శర్మను నియమించడం దగ్గరి నుంచి నామినేటెడ్ సభ్యులకు ఓటు హక్కు కల్పించడం దాకా అంతా బీజేపీ అనుకూలంగా జరుతుతోందని, ఎల్జీ ఇదంతా బీజేపీకి అనుకూలంగా చేస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు గుప్పిస్తోంది ఆప్.



## పాతపాటి సర్రాజు భౌతికకాయానికి సీఎం జగన్ నివాళులు

పెద అమిరం(ప.గో. జిల్లా): గుండెపోటుతో మరణించిన క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి సర్రాజు భౌతికకాయానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులు అర్పించారు.శనివారం మధ్యాహ్నం పశ్చిమగోదావరి జిల్లాలోని పాతపాటి సర్రాజు నివాసానికి చేరుకున్న సీఎం జగన్.. సర్రాజు భౌతికకాయానికి ఘనమైన నివాళులు అర్పించారు. ఈ క్రమంలోనే పాతపటి సర్రాజు కుటుంబ సభ్యులను సీఎం జగన్ పరామర్శించారు. పాతపాటి సర్రాజు మరణవార్త తెలిసిన వెంటనే ఆయన మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన సీఎం జగన్.. ఆపై వెంటనే పశ్చిమగోదావరి జిల్లాలోని సర్రాజు నివాసానికి బయల్దేరి వెళ్లారు.కాగా, పాతపాటి సర్రాజు గుండెపోటుతో మృతిచెందిన సంగతి తెలిసిందే. 1954లో కాళ్ల మండలం జక్కవరం గ్రామంలో జన్మించిన ఆయన.. కాంగ్రెస్ పార్టీ ద్వారా సర్రాజు రాజకీయాల్లోకి వచ్చారు. కోపల్లె సహకార సంఘం అధ్యక్షుడిగా, ఆకివీడు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ఆయన పని చేశారు. 2004లో ఉండి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి గెలిచి వైఎస్సార్ హయాంలో తొలిసారి ఎమ్మెల్యేగా అసెంబ్లీలోకి ఆయన అడుగుపెట్టారు. 17 జులై 2021న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. 14 ఆగష్టు 2021న ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం పోలవరం నియోజక వర్గ పరిశీలకులుగా సర్రాజు ఉన్నారు.



## పోరాడుతూనే ఉంటా.. భయపడే ప్రసక్తే లేదు: కోటంరెడ్డి

నెల్లూరు: ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి స్పష్టం చేశారు.తన అనుచరులను అక్రమంగా అరెస్టు చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ”తన అనుచరులు తాటి వెంకటేశ్వర్లు, జావెద్, రఘు అరెస్టు తీరును ఖండిస్తున్నాం. పోలీస్‌స్టేషన్లకు తీసుకెళ్లకుండా హైవేలో తిప్పారు. షాడో సీఎం సజ్జల సూచనల మేరకు పోలీసులు పని చేస్తున్నారు.నాతో సహా 11మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పోలీసుల వేధింపులకు భయపడను. ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉంటాను.. తగ్గేదే లేదు” అని కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి తేల్చి చెప్పారు.



# సంపాదకీయం

**ఆదివారం 19-02-2023**

## మళ్లీ మొదటికి బెంగాల్ కథ

పశ్చిమ బెంగాల్ లో గవర్నర్ మారినా.. పరిస్థితుల్లో ఇసుమంతైనా మార్పు కనిపించలేదు. గవర్నర్- ముఖ్యమంత్రి మధ్య విభేదాలు అలాగే కొనసాగుతున్నాయి. పాత గవర్నర్ స్థానంలో కొత్త గవర్నర్ వచ్చినా ప్రభుత్వం- గవర్నర్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి మాత్రం అలాగే కొనసాగుతోంది. గవర్నర్ గా జగదీప్ ధనకర్ ఉన్నప్పుడు రాష్ట్రంలో నిత్యమూ ఘర్షణ పూర్వక వాతావరణమే కనిపించేది. గవర్నర్ ధన్‌కడ్, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మధ్య సఖ్యత సంగతి పక్కన పెడితే నిత్యం ఉప్పు నిప్పులా ఒకరిపై ఒకరు చిటపటలాడుతూ ఉండేవారు. ధన్ కడ్ గవర్నర్ గా ఉన్నంత కాలమూ.. ఒక్క రోజు కాదు, ఒక్క క్షణం కూడా ఇరువురి మధ్యా సామరస్యపూరిత వాతావరణం ఉన్న దాఖలాలు లేవు. అయితే మమతకు ఊరట కలిగించేలా ధన్ కడ్ ఉప రాష్ట్రపతిగా ధన్‌కడ్ బాధ్యతలు స్వీకరించారు. ధన్ కడ్ పశ్చిమ బెంగాల్ గవర్నర్ గా వ్యవహరించిన తీరు కారణంగానే మోడీ ఆయనను ఉపరాష్ట్రపతి పదవికి ప్రతిపాదించారని పరిశీలకుల విశ్లేషణలు పక్కన పెడితే ఆయన రాష్ట్రం నుంచి వెళ్లిపోవడంతో మమత ఊపిరి పీల్చుకున్నారనే చెప్పారు. ఆయన స్థానంలో 1977 ఐఏఎస్ కేడర్‌కు చెందిన సీవీ ఆనంద్ ను పశ్చిమ బెంగాల్ గవర్నర్ గా మోడీ ఏరి కోరి ఎంపిక చేసి మరీ పంపించారు. గత ఏడాది నవంబర్‌లో సీవీ ఆనంద్ బోస్ పశ్చిమ బెంగాల్ గవర్నర్ గా బాధ్యతలు చేపట్టారు. ఆ పదవీ బాధ్యతలు స్వీకరించిన తొలి నాళ్లలో గవర్న్, పశ్చిమ బెంగాల్ సీఎం మమత బెనర్జీ మధ్య సుహృద్భావ పూరిత వాతావరణమే ఉ ఒడింది. మమత రచనలు, పెయింటింగ్లు, సంగీత కంపోజిషన్లు, అల్బమ్ లపై గవర్నర్ ప్రశంసల వర్షం కురిపించారు. అలాగే మమతా బెనర్జీ సైతం ఆయనకు ఎంతో ప్రీతిపాత్రమైన రసగుల్లాలను బహుమతిగా ఇచ్చారు. ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ మమత ప్రభుత్వం రూపొందించిన ప్రసంగాన్ని ఇటీవలి బడ్జెట్ సమావేశాలలో గవర్నర్ ఆనంద్ బోస్ అక్షరం పొల్లుపోకుండా చదివారు. ముఖ్యంగా ఎంజీఎన్ఆర్ ఈజీఏ, పీఎంఏవై నిధుల విషయంలో కేంద్రాన్ని తప్పుపడుతూ ఉన్న భాగాలను కూడా ఆయన అక్షరం పొల్లుపోకుండా చదివేశారు. అయితే ఇటీవల ఆయన వైఖరి మారింది. అందుకు కారణం ఆయన వ్యవహార శైలి పట్ల కేంద్రం కన్నెర్ర చేయడమేనని సీఎం మమతా బెనర్జీ ఆరోపిస్తున్నారు. ఇటీవల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ గవర్నర్ లో భేటీ అయ్యారు. వీరి మధ్య ఈ భేటీ దాదాపు రెండు గంటలకు పైగా జరిగింది. సాధారణంగా గవర్నర్ అంత సేపు ఎవరికీ అపాయింట్ మెంట్ ఇవ్వరు. కానీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి ఇచ్చారు. రాజ్ భవన్ లో జరిగిన ఈ భేటీ తరువాత నుంచే గవర్నర్ వైఖరిలో మార్పు వచ్చిందని పరిశీలకులు సైతం చెబుతున్నారు. ఆ భేటీ తరువాత లోకాయక్త నియామకం విషయంలో గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందులు కలిగేలా వ్యవహరించారు. ప్రమాణ స్వీకారం సైతం చేయలేదు. పైగా లోకాయుక్త నియామకం ఉత్తర్వులలో చట్టపరమైన లొసుగులు ఉ న్నాయని ఆరోపణలు సైతం చేశారు. ఆ వెంటనే తనకు ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న మమతా బెనర్జీకి సన్నిహితురాలిగా గుర్తింపు పొందిన నందినీ చక్రవర్తికి గవర్నర్ ఉద్వాసన పలికారు. దీంతో పశ్చిమ బెంగాల్ లో గవర్నర్- ప్రభుత్వం మధ్య సంబంధాలు మళ్లీ మొదటికి చేరుకున్నాయి. రాజకీయ ప్రాధాన్యత ఆధారంగానే గవర్నర్లను నియమించడం అన్నది గతంలోనే అంటే ఇందిరా గాంధీ హయాం నుంచే ఆరంభమైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ఉన్న సమయంలో గవర్నర్ గా ఉన్న రామ్ లాల్ వ్యవహరించిన తీరు ఎంత వివాదాస్పదం అయ్యిందో తెలియంది కాదు. అలాగే ఉ మ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ గా కుముద్ బెన్ జోషి ఉన్న సమయంలో కూడా వివాదాలకు కేంద్ర బిందువుగా రాజ్ భవన్ ఉండేదని రాజకీయ పండితులు ఇప్పటికీ చెబుతుంటారు. అప్పట్లో ఇలా ఒకటి రెండు ఉ దాహరణలే ఉండేవి. అప్పట్లో కూడా గవర్నర్ల వ్యవస్థ అవసరమా అన్న చర్చ పెద్ద స్థాయిలోనే జరిగింది. గవర్నర్ వ్యవస్థ అనవసరం అన్న చర్చకు అప్పట్లో ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చాలా బలంగా తెరమీదకు తీసుకువచ్చారు. ఇక ఇటీవలి కాలంలో అయితే చాలా వరకూ గవర్నర్లు పూర్తిగా రాజకీయ పాత్రల పోషణకే పరిమితమైపోయారన్న విమర్శ గట్టిగా వినిపిస్తోంది. జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలలో గవర్నర్లు వ్యవహరిస్తున్న తీరే ఇందుకు నిదర్శనమని పరిశీలకులు విశ్లేషణలు చేస్తున్నారు. అందుకే రాజకీయ పునరావాసంగా గవర్నర్లను నియమిస్తున్నారన్న ఆరోపణలు సైతం ఉన్నాయి. కేంద్రం లో ఉన్న ప్రభుత్వాలు తమ పార్టీకి చెందిన సీనియర్లకు, పదవుల అవకాశం లభించని వారికీ రాజకీయ పునరావాసం కింద గవర్నర్ పదవులలో నియమిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ సర్కార్ ఇప్పుడు రాజకీయాలతో సంబంధం లేని కీలక పదవులలో పని చేసి రిటైర్ అయిన వారిని గవర్నర్లుగా నియమించడానికి ప్రాధాన్యత ఇస్తున్నది.

# నెల్లూరులో రివెంజ్ పాలిటిక్స్

నెల్లూరు, ఫిబ్రవరి 18, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వేదాయపాలెం పోలీస్ స్టేషన్ కి వెళ్లారు. అక్కడి సిబ్బందితో మాట్లాడారు, వారు తమకు సమాచారం లేదన్నారు. చివరకు ఆయన పోలీస్ స్టేషన్లోనే కూర్చున్నారు. డీఎస్పీతో మాట్లాడి ఆయన వద్ద క్లారిటీ తీసుకున్నాకగానీ వెనుతిరగలేదు కోటంరెడ్డి. అనుకున్నంతా అయింది, నెల్లూరులో రివెంజ్ పాలిటిక్స్ మొదలయ్యాయ. 4 నెలల క్రితం జరిగిన ఓ ఘటనలో ఇప్పుడు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అనుచరుడు తాటి వెంకటేశ్వర్లుని పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో వెంటనే ఎమ్మెల్యే కోటంరెడ్డి వేదాయపాలెం పోలీస్ స్టేషన్ కి చేరుకున్నారు. అక్కడే డీఎస్పీతో ఫోన్ లో మాట్లాడారు. కావాలనే తన అనుచరులను అరెస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. 24 గంటల్లో తాటి వెంకటేశ్వర్లుని కోర్టులో హాజరుపరచకపోతే న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. తనతోపాటు వచ్చేవారంతా అన్నిటికీ తెగించే వస్తున్నారని, అరెస్ట్ లకు ఎవరూ భయపడబోరన్నారు ఎమ్మెల్యే కోటంరెడ్డి. నెల్లూరు రూరల్ పరిధిలో కోటంరెడ్డి అనుచరులు అరెస్ట్ అయిన ఘటన ఇది రెండోది. ఇటీవల సయ్యద్ సమి అనే మైనార్టీ నేతను హత్యాయత్నం కేసులో పోలీసులు అరెస్ట్ చేశారు. సయ్యద్ సమి కోటంరెడ్డి అనుచరుడే అయినా ఆయన అరెస్ట్ అయిన కేసు మాత్రం వేరే. బారాషహీద్ దర్గాలో మరో మైనార్టీ నేతల, ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ అనుచరుడిపై సమి కత్తితో దాడికి పాల్పడటంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పుడు తాటి వెంకటేశ్వర్లుని అరెస్ట్ చేయడంతో కలకలం రేగింది. తాటి వెంకటేశ్వర్లు, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డికి ప్రధాన అనుచరుడు. గత ఎన్నికల్లో కార్పొరేటర్ టికెట్ ఆయనకు దక్కకపోయినా ఆయన ఎమ్మెల్యేని వదిలిపెట్టలేదు. వైసీపీ నగర పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయన, కోటంరెడ్డితోపాటే బయటకు వచ్చేశారు. సౌమ్యుడిగా పేరున్న తాటి వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర స్వామి మాలధారణలో ఉన్నారు. ఆయన్ను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కి తీసుకెళ్లడంతో రూరల్ లో కలకలం రేగింది. మిగతా అనుచరులను భయపెట్టడానికే ఇలా అరెస్ట్ లు చేస్తున్నారంటూ మండిపడ్డారు కోటంరెడ్డి. అరెస్ట్ లతో ఎవరినీ బెదిరించలేరని, భయపెట్టలేరని ఆయన మండిపడ్డారు. అరెస్ట్ లు చేసుకున్నా, బెదిరింపులకు పాల్పడ్డా, అనుచరులంతా తనతోపాటే ఉంటారని, వారికి రక్షణగా తాను ఉంటానని చెప్పారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పార్టీని వదిలి బయటకు వచ్చిన తర్వాత దాదాపుగా చాలామంది ఆయన వెంట బయటకు వచ్చారు. అయితే రూరల్ విషయంలో సీఎం జగన్ ప్రత్యేక దృష్టి పెట్టారు. కోటంరెడ్డితోపాటు పార్టీ కేడర్ బయటకు వెళ్లకూడదని ఆయన స్థానిక నేతలకు ఆదేశాలిచ్చారు. ఎంపీగా ఉన్న ఆదాల ప్రభాకర్ రెడ్డిని నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా ప్రకటించడంతోపాటు, ఆయనకే ఇన్ చార్జ్ పోస్ట్ ఇచ్చారు. అక్కడ ఆదాల తన వర్గాన్ని ఏర్పాటు చేసుకునే అకాశమిచ్చారు. ఆదాల ఆధ్వర్యంలో రూరల్ సమస్యలన్నీ పరిష్కరించేందుకు కూడా సీఎం జగన్ హామీ ఇచ్చారు. అనుకున్నట్టుగానే ఆదాల నియోజకవర్గంలో కలియదిరిగేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కార్పొరేటర్లందర్నీ తనవైపు తిప్పుకోబోతున్నారు. రూరల్ సమస్యలపై సమీక్షలు నిర్వహించారు. త్వరలో గడప గడపకు ఆయన ఆధ్వర్యంలో కార్యక్రమాలు మొదలు కాబోతున్నాయి. ఈలోగా ఈ అరెస్ట్ లతో కలకలం రేగింది.

# మంత్రి అంబటికి వరుస షాక్



గుంటూరు, ఫిబ్రవరి 18, మంత్రి అంబటి రాంబాబు మరో వివాదంలో చిక్కుకున్నారు. గడప గడప కు కార్యక్రమంలో వార్డులో వారిని ప్రివేర్ చేయలేదని ఓ వాలంటీర్ ను విధుల్లోంచి తొలగించారు. సత్తెనపల్లి వావిలాలనగర్‌లో గడప గడపకు కార్యక్రమం నిర్వహిచారు మంత్రి అంబటి రాంబాబు. ఈ సందర్భంగా పలు కుటుంబాలను కలిసి ప్రభుత్వం వారికి అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీతమ్మ అనే మహిళ తనకు వచ్చే వితంతు పింఛన్ ను రద్దు చేశారని తెలిపింది. సీతమ్మ కుమారుడు వెంకటేశ్వర్లుకు కారు ఉండటం వల్ల పింఛన్ రద్దు చేసినట్లు వాలంటీర్ తెలిపారు. మంత్రితో ఈ విషయంలో వెంకటేశ్వర్లు గొడవ పడ్డాడు. గడప గడప కార్యక్రమానికి వస్తున్న సందర్భంలో వాలంటీర్ వార్డులో వారిని సరిగా సిద్ధం చేయలేకపోయాడని..తమకు అనుకూలంగా మాట్లాడే విధంగా ప్రిపేర్ చేయలేకపోయాడంటూ తక్షణం వాలంటీర్ ఆకుల శ్రీకాంత్ ను తొలగించాలంటూ ఆదేశం ఇచ్చారు మంత్రి అంబటి. వార్డులో సమస్యలు అడగకుండా ఎలా ఉంటారు. తనకి సంబంధం లేని విషయంలో ఆరోపణలు చేసి తన ఉద్యోగం నుంచి తొలగించారని లబోదిబో అంటున్నాడు వాలంటీర్ శ్రీకాంత్. "నేను 31వ వార్డు వాలంటీర్ ను. మొన్న గడప గడపకు కార్యక్రమంలో మంత్రి అంబటి రాంబాబు పాల్గొన్నారు. ఒక వ్యక్తి వాళ్ల అమ్మకు పింఛన్ రాలేదని మంత్రితో గొడవ పడ్డాడు. అయితే మంత్రి అంబటి రాంబాబు వాలంటీర్ ఎవరు అని కొనుక్కొన్ని నన్ను విధుల్లోంచి తొలగించారు. ఆయన గొడవపడే విషయం నాకు ముందుగా తెలియదు కదా. నన్ను అన్యాయంగా విధుల్లోంచి తొలగించారు. నేను అంబటి రాంబాబు గెలుపు కోసం ఎంతో కష్టపడ్డాం. అయినా మాకు ఏంచేయలేదు. ఏదో చిన్న ఉద్యోగం వాలంటీర్ గా చేసుకుంటున్నాను. ఇప్పుడు ఇది కూడా తొలగించారు. " - ఆకుల శ్రీకాంత్ మంత్రి అంబటి రాంబాబుపై ఎంపీటీసీ విజయలక్ష్మి ఇటీవల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నత పాఠశాలలో ఇటీవల జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎంపీటీసీ విజయలక్ష్మికి ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో గొడవ మెదలైంది. హెడ్ మాస్టర్ వనజాతో ఎంపీటీసీ వాగ్వివాదానికి దిగారు. ఇదే సమయంలో మంత్రిని ఉద్దేశించి ఎంపీటీసీ విజయలక్ష్మి తీవ్ర పదజాలంతో దూషించారు. పార్టీ కోసం పనిచేయని వాళ్లు గ్రామంలో పెత్తనం చేస్తున్నారంటూ ఫైర్ అయ్యారు. అంతే కాదు మంత్రి అంబటిని ఏకవచనంతో సంభోదించి మాట్లాడుతూ, చెప్పుతో కొడతానంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూలు పిల్లల ముందే ఎంపీటీసీ విజయలక్ష్మి ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడంతో విద్యార్థులు షాకయ్యారు. ఆమె చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. దాంతో ఈ వ్యవహారం నియోజకవర్గంలోనే కాదు, రాష్ట్ర పార్టీ కార్యాలయంలోని పెద్దలకు వీడియోలు చేరాయి. సత్తెనపల్లి నియోజకవర్గంలో అంబటికి వరుసగా షాక్ లు మీద షాక్ లు తగులుతున్నాయి. ఇటీవల కాలంలో ఆయన అనుచరులు లాటరీ టిక్కెట్ ల నిర్విహించడంతో కోర్టు ఆదేశాలతో మంత్రి అంబటిపై కేసు నమోదయ్యింది. అంతే కాదు గతంలో మహిళల వ్యవహారంలో అంబటిపై ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం చెక్కు ఇచ్చినందుకు రెండు లక్షల రూపాయలు లంచం అంబటి అడిగారని బాధితులు ఆరోపించడం నియోజకవర్గంలో కలకలం రేపింది. ఇలా వరుస ఘటనలతో అంబటి రాంబాబు నిత్యం హాట్ టాపిక్ గా మారుతున్నారు. అంబటి పై పార్టీ నేతలు కొందరు ఇప్పటికే పార్టీ అధినేతకు ఫిర్యాదు చేశారన్న ప్రచారం సైతం జరుగుతోంది. నియోజకవర్గంలో తమను కాదని వేరొకరికి ప్రాధాన్యత ఇస్తున్నారని, పార్టీ కోసం పని చేసిన వారిని పక్కన పెట్టి.. ఇతర పార్టీల నుండి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు.

# తాడికొండ వర్సెస్ డొక్కా

గుంటూరు, ఫిబ్రవరి 18,గుంటూరు జిల్లా వైసీపీలో నాయకుల మధ్య సఖ్యత కొరవడింది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఎమ్మెల్యేలు జిల్లా వైసీపీ చీఫ్ డొక్కా మాణిక్య వరప్రసాద్ కంటే సీనియర్లు. వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్నవారే. దీంతో నిన్నగాక మొన్న పార్టీలోకి వచ్చిన వారిని జిల్లా అధ్యక్షుడిగా గౌరవించాలంటే ఎలా అని డొక్కాను లెక్క చేయడం లేదట. పరిస్థితులను అర్థం చేసుకున్నారో ఏమో.. డొక్కా సైతం నాకెందుకు వచ్చిన గొడవ అని సైడ్ అయిపోతున్నారట. కేవలం పార్టీ కార్యక్రమాలతో సరిపెట్టి ఏరోజుకారోజు మమ అనిపిస్తున్నట్టు సమాచారం. గుంటూరు పార్లమెంటు వైసీపీ ఇంఛార్జ్‌గా గత ఎన్నికల్లో ఓడిన మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి ఉన్నారు. మోదుగులకు వైసీపీ వ్యవహారాలు.. క్రమశిక్షణ వంటి అంశాలలో సలహాలు సూచనలు డొక్కావల్ల అయ్యే పని కాదు. తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి.. జిల్లా అధ్యక్షుడి మాట వినే పరిస్థితి లేదు. డొక్కా వల్లే తనకు తాడికొండలో ఇబ్బందులు వచ్చాయని.. ఇప్పుడు కత్తెర సురేష్ రూపంలో హడావుడి చేస్తున్నారని ఎమ్మెల్యే అభిప్రాయం. దీంతో డొక్కా ఏం చెప్తే దానికి వ్యతిరేకంగా చేయడానికి శ్రీదేవి చూస్తున్నారట. తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్. మామూలుగానే నాయకులతో దూరం పాటించే శివకుమార్ తెనాలిలో ఇప్పటివరకు జిల్లా అధ్యక్షుడు డొక్కాతో అధికారికంగా ఓ చిన్న కార్యక్రమం కూడా చేయలేదు. డొక్కా కూడా తెనాలికి ఓ ప్రైవేట్ కార్యక్రమానికి వెళ్లి వచ్చారు కానీ.. అధ్యక్షుడి హోదాలో అక్కడ పర్యటించింది లేదు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్యకు వైసీపీలో సీనియర్ అయిన ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మామ. దాంతో డొక్కాకు పొన్నూరులో సీన్ లేదంటోంది పార్టీ కేడర్. ప్రత్తిపాడులో మాజీ హోంమంత్రి మేకతోటి సుచరిత ఉండటంతో అక్కడ జిల్లా అధ్యక్షుడి పప్పులు ఉడకడం లేదట. మేము ఆ సీటు వదిలేస్తే.. మీరు అధ్యక్షులయ్యారు అని సుచరిత బ్యాచ్ కామెంట్స్ చేస్తోందట. మంగళగిరిలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తీరే వేరు. అక్కడ డొక్కా, ఆర్కే ఈక్వేషన్ కష్టమన్నది ఓ టాక్. ఇక మిగిలింది గుంటూరు ఈస్ట్, వెస్ట్ నియోజక వర్గాలు. గుంటూరు సిటీలోనే ఉండే ఈ రెండు నియోజకవర్గాల్లో ఎప్పుడూ ఎమ్మెల్యేలు డొక్కాకు అంటి పెట్టుకొని ఉ ంటుంటారు. కానీ స్థానికంగా నిర్వహించే కార్యక్రమాలకు హాజరవడం తప్ప డొక్కా ప్రత్యేకంగా చేసే కార్యక్రమాలు ఏమీ ఉండవు. దీంతో జిల్లా అధ్యక్షుడు హోదాలో తాను ఎందుకు పనిచేస్తున్నాన్నో.. ఎవరిని కట్టడి చేయాలో.. ఎవరికి సలహాలు ఇవ్వాలో.. ఏ కార్యక్రమాలు నిర్వహించాలో తెలియక సతమతమవుతున్నారట. జిల్లా అధ్యక్షుడు హోదాలో ఏడు నియోజకవర్గాల కోఆర్డినేషన్ మీటింగ్ పెట్టాలన్నా ఎవరు వస్తారు.. ఎవరు రారు.. వచ్చినవాళు తన మాట వింటారో వినరో అనే అనుమానంతో ఉన్నారట డొక్కా. దీంతో చేసేదేమీ లేక పార్టీ కార్యక్రమాలు.. ఆదేశాలు పాటిస్తూ కాలక్షేపం చేస్తున్నారట.

# సీసోడియాకు మళ్లీ సమన్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18,ఢిల్లీ డిప్యుటీ సీఎం మనీశ్ సిసోడియాకు సీబీఐ మరోసారి సమన్లు జారీ చేసింది. లిక్కర్ స్కామ్ విచారణలో భాగంగా మరోసారి హాజరు కావాలని వెల్లడించింది. ఇదే విషయాన్ని సిసోడియా ధ్రువీకరించారు. ట్విటర్ ద్వారా వివరాలు వెల్లడించారు. "సీబీఐ నుంచి నాకు మరోసారి పిలుపు వచ్చింది. సీబీఐతో ఈడీలకు పూర్తి అధికారాలు ఇచ్చి నాపైకి వదులుతున్నారు. నా ఇంటిని సోదా చేశారు. బ్యాంక్ లాకర్‌నూ సెర్చ్ చేశారు. కానీ వాళ్లకు ఎలాంటి ఆధారాలు దొరకలేదు. ఢిల్లీలోని విద్యార్థులకు మంచి చదువు అందాలని ఎన్నో చర్యలు తీసుకున్నాను. అందుకే వాళ్లు నన్ను నియంత్రించాలని చూస్తున్నారు. నేను ఇప్పటి వరకూ విచారణకు సహకరించాను. ఇకపైన కూడా ఇదే విధంగా సహకరిస్తాను"

-మనీశ్ సిసోడియా, ఢిల్లీ డిప్యుటీ సీఎం

కీలక వ్యక్తుల పేర్లు..

ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో కీలక వ్యక్తుల పేర్లు ఈడీ ప్రస్తావించింది. ఈ కేసులో ఈడీ దాఖలు చేసిన సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్‌ను రౌస్ అవెన్యూ ప్రత్యేక కోర్టు పరిగణనలోకి తీసుకుని నిందితులకు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో తదుపరి విచారణను ఫిబ్రవరి 23కి వాయిదా వేసింది. ఈడీ దాఖలు చేసిన రెండో ఛార్జ్‌షీట్‌లో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, తెలంగాణ ఎమ్మెల్సీ కవిత, వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి గురించి ప్రస్తావించింది. ఎమ్మెల్సీ కవిత అనుచరుడు వి.శ్రీనివాసరావును విచారించినట్లు ఛార్జ్‌షీట్ లో ఈడీ తెలిపింది. కవిత ఆదేశాలతోనే అరుణ్‌పిళ్లైకి శ్రీనివాసరావు రూ.కోటి ఇచ్చారని ఈడీ స్పష్టం చేసింది. ఇప్పటికే ఎన్నో మలుపులు తిరిగిన ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఇప్పుడు మరో ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది.


## శంకుస్థాపన లేకుండానే...బందరు పోర్టు పనులు

విజయవాడ, ఫిబ్రవరి 18, బందరు పోర్ట్ నిర్మాణానికి శంకుస్థాపన త్వరలోనే ఉంటుందని గతంలోనే పార్లమెంట్ సభ్యులు బాలశౌరి ప్రకటించారు. అయితే ఈ విషయంలో పునరాలోచన చేసిన ఆయన ఇక పనులకు శంకుస్థాపన కాకుండా ఏకంగా పనులను ప్రారంభించటమే ఉత్తమమని భావిస్తున్నారు. ఇప్పటికే పలు దఫాలుగా శంకుస్థాపనలు జరిగినవేళ ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ షెడ్యూల్ ఖరారు కాగానే, డేట్ ప్రకటిస్తామని తాజాగా వెల్లడించారు. బందరు పోర్ట్ నిర్మాణ పనులపై అనేక దశాబ్దాలుగా సందిగ్ధత కొనసాగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి రెండు సార్లు బందరు పోర్ట్ నిర్మాణ పనులను ప్రారంభించేందుకు శంకుస్థాపన చేశారు. అయితే ఆనాటి పునాది రాళ్ళు కూడా కనుమరుగు అయిపోతున్నాయి. పోర్ట్ నిర్మాణం జరిగితే దశాబ్దాలుగా కలలు కంటున్న స్థానికుల కల తీరుతుందని అంటున్నారు. కేంద్రం సహకారంతో అన్ని రకాల అనుమతులు తీసుకువచ్చి, నిర్మాణ పనులకు శంకుస్థాపన కాకుండా, పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పార్లమెంట్ సభ్యులు బాలశౌరి చెబుతున్నారు. బందరు పోర్టు నిర్మాణానికి 5,253.88 కోట్ల రూపాయలు అవసరం అవుతాయని అంచనా వేస్తున్నారు. ఇందులో 75 శాతం బ్యాంకు రుణం, 25 శాతం ప్రభుత్వం సొంతంగా ఖర్చు చేయాలని గతంలోనే అంచనాకు వచ్చారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ 75 శాతం రుణం ఇచ్చేందుకు కూడా ఆమోదం లభించింది. దీంతో క్యాబినేట్ సమావేశంలో కూడా రుణం తీసుకునే అంశంపై చర్చించారు. రుణం పొందేందుకు క్యాబినేట్ గ్రీన్ సిగ్నల్ కూడా ఇచ్చింది. సముద్ర కెరటాలను అడ్డుకోవడానికి 2 కిలోమీటర్ల 325 మీటర్ల దక్షిణం, ఉత్తరం బ్రేక్స్ వాటర్ గోడల నిర్మాణాలకు రూ.446 కోట్లు అవసరం అవుతాయని ఇప్పటికే అంచనాలు కూడా రూపొందించారు. ఉత్తరం వైపున 250 మీటర్ల కొండరాళ్లతో కాంక్రీట్ గోడ నిర్మాణానికి రూ. 10. 94 కోట్లు, అలాగే దక్షిణం వైపున సడన్ బ్రేక్ వాటర్ రూ. 435 కోట్ల రూపాయలు వ్యయం అవుతుంది. 4. 6 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వాల్సివస్తుందని, ఇందుకు అవసరం అయిన అన్ని చర్యలు తీసుకునేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. డ్రెడ్జింగ్ కోసం మరో రూ.1242.88 కోట్లు, సముద్రం నుంచి ఓడలు రావడానికి అప్రోచ్ ఛానెల్ నిర్మాణానికి రూ. 706.26 కోట్లు, బ్రేక్ వాటర్ మధ్యలో ఓడలు తిరగడానికి టర్నింగ్ సర్కిల్, బెర్త్ పాకెట్స్ కోసం రూ.452.07 కోట్లు ఖర్చు అవుతుందని డీపీఆర్ రెడీ చేశారు. బందరు పోర్టులో మొదటి విడతగా 4 బెర్తుల నిర్మాణం జరుగుతుందని.. మూడు బెర్తుల కోసం రూ.548 కోట్లు, బల్క్ కార్గో కోసం ఒక బెర్త్ .. దీనికి రూ.158 కోట్లు వ్యయం అవుతుందని ఇప్పటికే ఎమ్మెల్యే పేర్ని నాని తెలిపారు. ఈ పోర్టు నిర్మాణం పూర్తయితే 80 వేల టన్నుల బరువుతో వచ్చే షిప్పులు సైతం సురక్షితంగా రాగలుగుతాయన్నారు. లక్ష నుంచి లక్షన్నర బరువుతో ఉండే షిప్పులు వచ్చే బెర్తులను సెకెండ్ ఫేజ్‌లో నిర్మిస్తామన్నారు. బందరు పోర్టు నిర్మాణానికి 1730 ఎకరాల ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. మొదటి దశలో ఒక్క ఎకరం ప్రైవేట్ భూమి కూడా తీసుకోవడం లేదన్నారు. రైల్, రోడ్డు నిర్మాణానికి 235 ఎకరాలు సేకరించాల్సి ఉందన్నారు. దీనిలో భాగంగా మూడు రోడ్ ఓవర్ బ్రిడ్జ్ (ఆర్వోబీ)లను నిర్మించాల్సి ఉ ంటుందని పేర్ని నాని చెప్పారు.

# ఏపీలో సారధుల వార్

విజయవాడ, ఫిబ్రవరి 18, ఎన్నికల దగ్గర పడు?న్న వేళ ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాలు సరికొత్త పంథాలో సాగుతున్నాయి. ఇన్నాళ్లు గ్రామాల యూనిట్‌గా రాజకీయాలు జరిగేవి. ఇప్పుడు అది కాస్త కుటుంబాలను యూనిట్‌గా తీసుకొని పాలిటిక్స్‌ను స్టార్ట్ చేస్తున్నాయి పార్టీలు. వైసీపీ గృహసారథుల పేరుతో ప్రజల ముంగిటకు వెళ్తుంటే ఇప్పుడు దానికి పోటీగా సాధిక సారథుల పేరుతో తెలుగుదేశం ప్రత్యేక వ్యవస్థను తీసుకొస్తోంది. ఇలాంటి వ్యవస్థలను 2014లోనే టీడీపీ తీసుకొచ్చింది. అప్పట్లో జన్మభూమి కమిటీలు ప్రవేశ పెట్టింది. ఆ గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి పథకాలు అందేలా చూడాలన్నది ఆ కమిటీ ముఖ్య ఉద్దేశం. అయితే వాళ్లకు ఎలాంటి జీతభత్యాలు లేకుండా పని చేయాల్సి వచ్చింది. దీంతో రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో జన్మభూమి కమిటీ సభ్యులు అక్రమాలకు పాల్పడ్డారు. వాళ్ల అక్రమాలతో ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డ పేరు తీసుకొచ్చారు. 2019లో టీడీపీ ఓటమిలో ఈ కమిటీ పని తీరు కూడా ప్రధాన కారణమైంది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ... గ్రామ వాలంటీర్లు, వార్డు వాలంటీర్ల పేరుతో కొత్త వ్యవస్థను తీసుకొచ్చింది. ప్రతి యాభై కుటుంబాలకు వాలంటీర్‌ను పెట్టారు. ప్రభుత్వం నుంచి నెలకు ఐదు వేల వేతనం ఇస్తూ పని చేయించుకుంటున్నారు. వీళ్ల నియామకానికి అధికారికంగా నోటిఫికేషన్ ఇచ్చి స్థానికంగా ఉండే వాళ్లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ వ్యవస్థపై కూడా చాలా ఆరోపణలు ఉన్నాయి. ఎప్పటికప్పుడు ఆరోపణలు సవరించుకుంటూ ప్రభుత్వం ఆ వ్యవస్థ కళ్లూ చెవుల్లుగా భావిస్తోంది. ప్రతి ఏటా వాళ్లలో ఉత్తమ పని తీరు కనబరిచిన వాళ్లను సన్మానిస్తోంది. వాలంటీర్ వ్యవస్థ అధికారికంగా ప్రభుత్వం తరఫున పనిచేయాలి. అందుకే పార్టీ పథకాలను, ప్రణాళికలు చెప్పేందుకు వైసీపీ గృహసారథులు అనే వ్యవస్థను తీసుకొచ్చింది. దీని నియాకమ ప్రక్రియ వేగంగా చేస్తోంది. వాంలటీర్‌కు సమానంగా ఈ గృహసారథులను నియమించాలని వైసీపీ భావిస్తోంది. ప్రభుత్వం తరఫున వాలంటీర్‌లు కార్యక్రమాలు చేపడితే... పార్టీ తరఫున గృహసారథులు పార్టీ తరఫున కార్యక్రమాలు చేపట్టనున్నారు. ప్రతి ఫ్యామిలీతో మాట్లాడేందుకు ఈ గృహసారథులను వైసీపీ వాడుకోనుంది. ప్రతి కుటుంబంతో పది నుంచి పదిహేను నిమిషాలు మాట్లాడి.. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన తీసుకొచ్చిన పథకాలు, రాష్ట్రంలో, ఆయా కుటుంబాల్లో వచ్చిన మార్పులు, గతంలో ఉన్న దుస్థితి వివరిస్తారు. ప్రతి ఓటు తమకే పడేలా ప్లాన్ చేస్తారు. వైసీపీ తీసుకొచ్చిన గృహసారథులకు కౌంటర్‌గా తెలుగుదేశం సాధికారిక సారథులు తీసుకొస్తోంది. తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో ఉన్న చంద్రబాబు ఈ వ్యవస్థ గురించి వివరించారు. తాము తీసుకొస్తున్న వ్యవస్థలో మహిళల కోసం మహిళను, పురుషులతో మాట్లాడేందుకు పురుషులను నియమించబోతున్నట్టు వివరించారు. వీళ్లు కూడా ఇప్పుడు రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం ఇస్తున్నది ఎంతా... తీసుకుంటున్నది ఎంతా అనేది వివరించనున్నారు. ఇలా వైసీపీ, టీడీపీ మధ్య సరికొత్త వార్ మొదలైనట్టు కనిపిస్తోంది. ప్రతి కుటుంబంలో ఉన్న ఓట్లను టార్గెట్‌గా చేసుకొని రెండు పార్టీలు సరికొత్త కార్యక్రమాలు తీసుకొచ్చాయి. దీంతో రాజకీయం ఎలా ఉండబోతుందనే ఆసక్తి నెలకొంది.

# ఏపీ బీజేపీకి ఎందుకిలా....



కాకినాడ, ఫిబ్రవరి 18, ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ పరిస్థితి ఏమిటి?? కన్నా లక్ష్మీనారాయణ రాజీనామా తర్వాత మరోసారి ఈ ప్రశ్న తలెత్తింది. 2024 నాటికి ఏపీలో బలమైన రాజకీయ శక్తిగా ఎదగాలనుకున్న బీజేపీ అందుకు సమీపం దూరంలో కూడా నిలువలేకపోతోంది. గ్రూపు గొడవలు, అంతర్గత విభేదాలతో ఆ పార్టీ సతమతమవుతోంది. అధ్యక్షులు మారినా పార్టీ పరిస్థితిలో మాత్రం ఎలాంటి మార్పు రావట్లేదు.ఏపీ బీజేపీలో ఒకటికి నాలుగు గ్రూపులు తయారు కావడమే దీనికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. బీజేపీ-ఆర్‌ఎస్ఎస్ గ్రూపు ఒకటైతే, టీడీపీ అనుకూల వర్గం, వైసీపీ అనుకూల వర్గాలుగా పార్టీ నేతలు చీలిపోయారు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీకి కమ్మ సామాజిక వర్గం, వైఎస్సార్సీపీకి రెడ్డి సామాజిక వర్గం నుంచి మద్దతు ఉంటంతో, కాపుల మద్దతుతో ఎదగాలని బీజేపీ ప్లాన్ చేసింది. అదే సమయంలో జనసేన పవన్ కళ్యాణ్‌ను దగ్గర తీసుకోవడం ద్వారా లాభ పడాలని భావించింది. అయితే ఈ ప్రణాళికలు ఏవి బీజేపీ అదృష్టాన్ని మెరుగుపరచలేదు.2019 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు రాష్ట్రంలోని 173 స్థానాల్లో పోటీ చేస్తే ఆ పార్టీకి ఒక్క చోట కూడా డిపాజిట్ దక్కలేదు. మొత్తం పోలైన ఓట్లలో ఒక్క శాతం కంటే తక్కువే బీజేపీకి వచ్చాయి. కేవలం 0.84శాతం ఓట్లు మాత్రమే బీజేపీకి దక్కాయి. అధికారంలోకి రావడం కంటే ముందు ప్రధాన ప్రతిపక్షంగా ఎదగాలనుకున్న కోరిక కూడా నెరవేరలేదు.గత కొంత కాలంగా ఏపీలో బీజేపీ పరిస్థితి ఏమాత్రం ఆశాజనకంగా లేదు. ఇతర పార్టీల నుంచి బీజేపీలో నాయకులు వలస వెళ్లినా పార్టీని బలోపేతం చేయడంపై ఎవరు పెద్దగా పనిచేసిన దాఖలాలు మాత్రం కనిపించలేదు. దీనికి తోడు బీజేపీలో అంతర్గత విభేదాలు తారాస?థాయికి చేరడం వచ్చే ఎన్నికల్లో బీజేపీ పరిస్థితికి అద్దం పడుతోంది.కన్నా రాజీనామాతో బీజేపీ-జనసేన పొత్తు అంశం కూడా తెరపైకి వచ్చింది. జనసేనతో పొత్తు ఉన్నా రెండు పార్టీలు కలిసి పనిచేసిన సందర్భం లేదు. మరోవైపు జనసేన టీడీపీకి దగ్గరైతే బీజేపీ పరిస్థితి ఏమిటనే చర్చ కూడా ఉంది. టీడీపీతో ఎట్టి పరిస్థితుల్లో జత కలవకూడదనే ఉద్దేశంలో ఉన్న బీజేపీ అదే సమయంలో సొంతంగా ఎదిగే ప్రయత్నాలు కూడా పెద్దగా చేయట్లేదు. కేంద్ర పార్టీ ఆదేశించిన సమయంలో మినహా మిగిలిన సమయంలో నాయకులు పెద్దగా ఎవరికి ఇబ్బంది కలగని విధంగా తమ పని తాము చేసుకుంటూ పోతున్నారు. సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడంపై ఎవరు ఆసక్తి చూపడం లేదు.వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్న జివిఎల్ వంటి నాయకులు మాత్రమే సొంత ప్రయత్నాలు చేసుకుంటున్నారు. పార్టీని రాష్ట్ర వ్యాప్తంగా బలోపేతం చేయడంపై ఆ పార్టీ నేతలు ఒక్క తాటిపైకి వచ్చిన దాఖలాలు మాత్రం లేవు.బీజేపీ ప్రస్తుత పరిస్థితి చూసి మొదట్నుంచి ఆ పార్టీలో ఉన్న నాయకులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. పార్టీ ఆవిర్భవించిన 40ఏళ్లలో ప్రాంతీయ పార్టీలను నమ్ముకోవడం వల్ల ఏపీలో బీజేపీ ఎదగలేకపోయిందని, బీజేపీ సిద్ధాంత పరమైన పునాదుల్ని బలోపేతం చేసే రాజకీయ వాతావరణం ఏపీలో అనువుగా లేకపోవడం ఓ కారణమైతే, ప్రాంతీయ పార్టీల ఛాయలో ఉండిపోవడం నష్టం కలిగించిందని చెబుతున్నారు.గతంలో టీడీపీతో దోస్తీ బీజేపీకి బాగా చేటు చేసిందని దాని నుంచి గుణపాఠాలు నేర్చుకుని ముందుకు సాగాల్సింది పోయి అందుకు భిన్నంగా సాగుతున్నారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. టీడీపీతో స్నేహం వల్ల బీజేపీకి ఒకప్పుడు జరిగిన నష్టమే ఇప్పుడు కూడా ఇతర పార్టీల వల్ల కలుగుతోందని, తమ పార్టీ నాయకుల ఇతర పార్టీల నాయకుల ప్రాపకం కోసం పాకులాడటం వదిలేస్తే పార్టీకి మంచి రోజులొస్తాయని బీజేపీకి చెందిన కీలక నాయకుడొకరు చెబుతున్నారు.

# ఆచితూచి కన్నా అడుగులు



విజయవాడ, ఫిబ్రవరి 18, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ బీజేపీ గుడ్ బై చెప్పేశారు. రాజకీయ భవిష్యత్తుపై రెండు, మూడు రోజుల్లో నిర్ణయం తీసుకుంటానని ప్రకటించారు. కన్నా దారి ఎటువైపనే చర్చ ఏపీ పొలిటికల్ సర్కిల్స్‌లో జోరుగా సాగుతోంది. కన్నా జనసేన వైపు వెళ్తారని ప్రచారం జరిగినా, అలా జరగకపోవచ్చని ఆయన అనుచరులు చెబుతున్నారు.దాదాపు నాలుగు దశాబ్దాలుగా కన్నా రాజకీయాల్లో కొనసాగుతున్నారు. ఐదుగురు ముఖ్యమంత్రుల వద్ద మంత్రిగా పనిచేశారు. వైఎస్సార్, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి క్యాబినెట్‌లలో ఓ వెలుగు వెలిగారు. రాష్ట్ర విభజన సమయంలో రాజకీయ సందిగ్ధత నెలకొన్న సమయంలో ఓ దశలో ముఖ్యమంత్రి అభ్యర్థిగా కూడా కన్నా పేరు తెరపైకి వచ్చింది. కిరణ్ కుమార్ రెడ్డి స్థానంలో కన్నా లక్ష్మీనారాయణకు సిఎంగా ఛాన్స్ ఇస్తారని ప్రచారం జరిగింది.రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ పార్టీకి రాజకీయ భవిష్యత్తు ఉండదనుకున్న నాయకులు అంతా చెల్లాచెదురయ్యారు. కన్నా కూడా కాంగ్రెస్ పార్టీని విడిచిపెట్టి బీజేపీలో చేరిపోయారు. దాదాపు 9ఏళ్లుగా బీజేపీలో ఉంటున్నారు. 2014, 2019లో ఆయనకు ఎలాంటి పదవులు దక్కలేదు. 2019లో ఎంపీగా పోటీ చేసినా ఓడిపోయారు. అయితే నాటి ఎన్నికల్లో బీజేపీ ఒక్క స్థానంలో కూడా గెలవకపోవడానికి కన్నాను పార్టీ బాధ్యుడ్ని చేసింది. 2018లో అప్పగించిన అధ్యక్ష బాధ్యతల నుంచి రెండేళ్లలోనే తప్పించింది. ఇది కన్నాను మొదట మనస్తాపానికి గురి చేసింది.ఎన్నికలకు పది నెలల ముందు మాత్రమే తనకు బాధ్యతలు అప్పగించినా శక్తివంచన లేకుండా శ్రమించానని, ఓటమికి మాత్రం తనను బాధ్యుడ్ని చేశారని కన్నా ఆరోపించారు. మరోవైపు ఏపీలో బీజేపీని ఎదగకుండా చేయడంలో సొంత పార్టీ నేతలే కారణమని ఎప్పటి నుంచో కన్నా ఆరోపిస్తున్నారు.2019 ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ బీజేపీకి దగ్గరయ్యారు. ఆ పార్టీతో రాజకీయ పొత్తు కుదుర్చుకుంటున్నట్లు ప్రకటించారు. అదే సమయంలో బీజేపీ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి మార్పు జరగడంతో రెండు పార్టీలు కలిసి ఒక్కసారి కూడా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదు. బీజేపీ-జనసేన బంధం బలపడకపోవడానికి కూడా సోము వీర్రాజే కారణమని కన్నా ఆరోపిస్తున్నారు.జనసేన పిఏసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌తో కన్నా లక్ష్మీనారాయణ చర్చలు జరపడంతో ఆ పార్టీలో చేరుతారని విస్తృత ప్రచారం జరిగింది. తాజాగా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుతో కన్నా టచ్‌లో ఉన్నారని చెబుతున్నారు. జనసేన కంటే టీడీపీతో కలిసి సాగడమే నయమని కన్నా భావిస్తున్నారని సన్నిహితులు చెబుతున్నారు. ప్రస్తుతం గుంటూరు వెస్ట్ నుంచి టీడీపీ తరపున గెలిచిన మద్దాలి గిరి వైసీపీ వైపు వెళ్లిపోయారు. దీంతో ఆ స్థానం నుంచి కన్నా పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది.మరోవైపు జనసేనకు సంస్థాగతంగా బలం లేకపోవడంతో, టీడీపీకి బలమైన క్యాడర్ ఉండటంతో టీడీపీ వైపు కన్నా మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోను గెలిచి తీరాలనే నిర్ణయంతోనే టీడీపీ జెండా కప్పుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

# రెంటికి చెడ్డ రేవడిలా ఆర్టీసీ ఉద్యోగులు

తిరుపతి, ఫిబ్రవరి 18, కొండ నాలుక్కి మందేస్తే ఉన్న నాలుక ఊడిపోయిందన్నట్లుగా తయారైంది ఆంధ్రప్రదేశ్ లో ఆర్టీసీ ఉద్యోగుల పరిస్థితి. ప్రభుత్వ ఉద్యోగులమయ్యాం అని సంబరపడినంత సేపు పట్టలేదు వారికి తాము పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డామని తెలుసుకోవడానికి. తమది ప్రభుత్వ ఉద్యోగం కాదు వెట్టి చాకిరీ అని వారు ఇప్పుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నామంటూ ప్రభుత్వం ప్రకటించగానే సంబరాలు చేసుకున్న ఆర్టీసీ ఉద్యోగులు ఇప్పుడు ప్రభుత్వ నిర్ణయం వల్ల ఉన్న సదుపాయాలు కోల్పోయి కుడితిలో పడ్డ ఎలుకలా తమ పరిస్థితి తయారైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా ప్రభుత్వోద్యోగం వస్తే ఇక జీవితం సెటిల్ అయినట్లే అని భావిస్తారు. ఆంధ్రప్రదేశ్ లో ఆర్టీసీ ఉద్యోగులు కూడా అలాగే సంబరపడ్డారు. గత ఏడాది ఆర్టీసీని ఏపీ సర్కార్ ప్రభుత్వంలో విలీనం చేసింది. ఆర్టీసీ ఉద్యోగులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించేసింది. ఇంకే ముంది తమ జీవితాలు ధన్యమైపోయినట్లేనని ఆర్టీసీ ఉద్యోగులంతా సంబరాలు చేసుకున్నారు. సీఎం జగన్ కు క్షీరాభిషేకాలు చేశారు. పీఆర్సీ కోసం ఉద్యోగులు అప్పట్లో చేసిన ఆందోళన కు కూడా వారు దూరం జరిగారు. అయితే ఆ తరువాత కానీ వారికి తత్వం బోధపడలేదు.జగన్ సర్కార్ తమకు అర చేతిలో వైకుంఠం చూపి నిలువునా ముంచేసిందని. ఆర్టీసీ పేరుకే ప్రభుత్వ సంస్థ కానీ, ఆ సంస్థలో ఉద్యోగులకు మాత్రం గతమే మేలు అని ఫీలయ్యే పరిస్థితి వచ్చింది. అప్పట్లో పేరుకే కార్పొరేషన్ ఉద్యోగులం కానీ.. తమకు రావలసిన వేతనాలు, వేతన బకాయిలు, టీఏలు, డీఏలు సమయానికి వచ్చేవనీ, ఏటేటా ఇంక్రిమెంట్లూ సవ్యంగా దఖలు పడేవనీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని వాపోతున్నారు. గతంలో ఆర్టీసీ కార్పొరేషన్ గా ఉన్నప్పుడు ఉద్యోగులకు క్రమం తప్పకుండా రాయతీలు, అలవెన్సులూ అందేవి. ఇప్పుడు ప్రభుత్వంలో విలీనం పేరు చెప్పి వాటిని నిలిపివేసింది జగన్ సర్కార్. అంతేనా ప్రభుత్వోద్యోగులు పీఆర్సీ కోసం చేసిన ఆందోళనలో పాల్గొనకుండా ప్రబుత్వానికి మద్దతుగా నిలిచినందుకు బోనస్ గా ఆర్టీసీ ఉద్యోగులకు పీఆర్సీ కూడా ఇవ్వలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆందోళనకు దిగిడంతో ఇక తప్పదన్నట్లుగా జగన్ సర్కార్ గత ఏడాది జూన్ లో పీఆర్సీ అమలు చేస్తున్నట్లుగా ఉత్తర్వులు జారీ చేసింది.కానీ ఆ పెరిగిన వేతనాలు ఆర్టీసీ ఉద్యోగులకు రెండు నెలల తరువాత కానీ అందలేదు. అయితే గత ఆరు నెలలుగా ఆర్టీసీ ఉద్యోగులకు ఓటీ, ఇతర అలవెన్సులనూ సర్కార్ నిలిపివేసింది. పోనీ ఓటీలు చేయడం మానేద్దామా అంటే వస్తున్న జీతం చాలదు. అయినా ఓటీ చేసినా డబ్బులు రావడం లేదు కనుక మానేద్దామంటే ఉద్యోగం ఊడిపోతుందన్న భయం వారిని వెంటాడుతోంది. ఎందుకంటే ఆర్టీసీలో గత పదేళ్లుగా కొత్త నియామకాలు లేవు. దీంతో రిటైరైన వాళ్లు రిటైరైపోతున్నారు. ఆ పని భారం కూడా ఉన్న వారి మీదే పడుతోంది. దీంతో నిబంధనల ప్రకారం డ్యూటీ టైం 8 గంటలు అయినా 12 గంటల పాటు పని చేసి తీరాల్సిన అనివార్య పరిస్థితి ఉంది. ముఖ్యంగా గ్యారేజీలలో పని చేసే వారిపై ఈ భారం అధికంగా ఉంది. దీంతో ఏపీలో ఆర్టీసీ ఉద్యోగుల పరిస్థితి పేరుకే ప్రభుత్వోద్యోగం చేస్తున్నది మాత్రం వెట్టి అన్నట్లుగా తయారైంది. ఇక ఆర్టీసీలో కాంట్రాక్టు పద్ధతిపై పని చేస్తున్న వారి పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. వారికి ఇచ్చే వేతనాలే అంతంత మాత్రం. ఆ మాత్రం వేతనాలతోనే అధిక గంటలు పని చేయిస్తూ.. ఎక్కువ సమయం పని చేస్తే ఇవ్వాల్సిన ఓటీకి కూడా ఎగనామం పెడుతూ జగన్ సర్కార్ వారి శ్రమను నిలువునా దోచుకుంటోంది.

# కాంగ్రెస్ చేసిన తప్పులే జగన్ చేస్తున్నారు

రాజమండ్రి, ఫిబ్రవరి 18, (న్యూస్ పల్స్): అనపర్తిలో చంద్రబాబును అడ్డుకోవడం వైసీపీకి మైనస్ అవుతుందని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. రాజమండ్రిలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్ నుంచి లోకేశ్ వరకూ పాదయాత్రలు చూశానన్న ఆయన... నిన్న చంద్రబాబును అడ్డుకున్న పరిస్థితి ఎప్పుడూ చూడలేదన్నారు. రాజకీయాల్లో ఆత్మహత్యలే ఉంటాయన్నారు. నాడు కాంగ్రెస్ జగన్ ను జైలుకు పంపడం వల్ల ముఖ్యమంత్రి అయ్యారని గుర్తుచేశారు. సరిగ్గా ఇదే రోజున తొమ్మిదేళ్ల క్రితం లోక్ సభలో అన్యాయంగా ఆంధ్రప్రదేశ్ ను విభజించారన్నారు. సుప్రీంకోర్టులో ఈనెల 22న విభజన కేసుపై వాయిదా ఉందని ఉండవల్లి అన్నారు. ఇంకా నాలుగు రోజులు సమయం ఉందని, రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్ వేయాలని, ఇదే లాస్ట్ ఛాన్స్ అని గుర్తుచేశారు. నా వాదన సరైందని సజ్జల అన్నారని ఉండవల్లి తెలిపారు. కేంద్రంపై పోరాటం చేస్తేనే విభజన హక్కులు సాధిస్తామన్నారు.

12 కెమెరాలు ఒక్కసారే పాడైపోయాయి

"ఇదే రోజు తొమ్మిదేళ్ల క్రితం లోక్ సభ తలుపులు మూసేసి, టెలికాస్ట్ ఆపేసి, ఆంధ్రా ఎంపీలను సస్పెండ్ చేసి ఎంత మంది అనుకూలం, వ్యతిరేకం అనేది తెలియకుండా భారతదేశం చరిత్రలో పాసైపోయింది అని ప్రకటించిన మొట్టమొదటి బిల్లు ఏపీ పునర్వ్యవస్థీకరణ బిల్లు. నేను అప్పటి నుంచి చెబుతూనే ఉన్నాను. ఈ బిల్లు పాస్ అవ్వలేదు. ఏదైనా బిల్లు పాస్ అవ్వాలంటే ముందు దానిపై చర్చ జరగాలి. ఎంతమంది అనుకూలం, వ్యతిరేకం అనే స్పీకర్ అడగాలి. 367 ఆర్టికల్ స్పీకర్ వాడుకుని డివిజన్ పెట్టలేదు. అలాగే లైవ్ టెలికాస్ట్ ఆగిపోయిందని చెప్పింది కూడా మొట్టమొదటి సారి ఇదే. ఈ బిల్లు చర్చ జరిగినప్పుడు మాత్రమే 12 కెమెరాలు పాడైపోయాయి. ఆ తర్వాత వెంటనే రిపేర్ అయిపోయింది. ఈ విషయంపై చాలా మంది పిటిషన్ వేశాం. ఈ బిల్లులో పోలవరం, ప్రత్యేక హోదా కూడా ఉంది. ఈ బిల్లుపై సమాచార హక్కు కింద వివరాలు అడిగితే సెక్షన్ 8 ప్రకారం సమాచారం ఇవ్వలేమని చెప్పారు. ఈ బిల్లుపై కోర్టుకు వెళ్తే తొమ్మిదేళ్ల తర్వాత వింటాం అన్నారు. " - ఉండవల్లి అరుణ్ కుమార్ "అదానీ వ్యవహారంపై విచారణ జరగాలి. మోదీ అధికారంలోకి వచ్చే టైంకి 609వ స్థానంలో అదానీ ఉన్నారు. 2020 నాటికి అదానీ ఆస్తి పెరిగి 4వ స్థానానికి వచ్చారు. డిసెంబర్ 2021 లో ఆస్ట్రేలియా నుంచి అదానీ బొగ్గు దిగుమతి చేసుకుంటున్నారని వార్తలు వచ్చాయి. ఆ తర్వాత భారత ప్రభుత్వం బొగ్గుపై దిగుమతి సుంకాన్ని 2.5 శాతం నుంచి జీరో చేసేసింది.

బొగ్గుపై దిగుమతి చేసుకుంటే ఎటువంటి సుంకం కట్టక్కర్లేదని ప్రకటించింది. ఆ తర్వాత కోల్ ఇండియాను భారత ప్రభుత్వం 12 మి.టన్నుల బొగ్గును దిగుమతి చేసుకోవాలని ఆదేశించింది. అదే రోజు అదానీకి 8 వేల కోట్ల ఎన్టీపీసీ ఆఫర్ ఇచ్చింది. దీన్ని క్రోనీ క్యాపిటలిజమ్ అంటారు. ఒక్క శాతం ఇండియన్స్ దగ్గర 42 శాతం ఆదాయం ఉంది. " - మాజీ ఎంపీ ఉండవల్లి "రాజశేఖర్ రెడ్డి, షర్మిల, జగన్, చంద్రబాబు, లోకేశ్ పాదయాత్రలు జరిగాయి. అయితే ఏ పాదయాత్రలోనూ నిన్న అనపర్తిలో జరిగిన ఘటనలు చూడలేదు. ఇందిరా గాంధీని కూడా ఇలాగే చేసి జైలు పెట్టారు. దీంతో ఆమె మళ్లీ ప్రధాని అయ్యారు. జగన్ మోహన్ రెడ్డిని జైలు పెట్టడం అనేది కాంగ్రెస్ పార్టీ చేసినటు వంటి అదిపెద్ద తప్పు. తుడిచేయలేనటువంటి తప్పు. ఆ తప్పు వల్లే జగన్ పై ప్రజల్లో సింపథీ వచ్చింది. రాజకీయాల్లో ఆత్మహత్యలే ఉంటాయి. దీన్ని అధికారంలో ఉన్నవాళు గుర్తుపెట్టుకోవాలి. చంద్రబాబు అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తారు. నిన్న జరిగిన సంఘటనలు వైసీపీకి మైనస్ అవుతాయి." - ఉండవల్లి అరుణ్ కుమార్

# గుర్రపు స్వామి అంకాల పరమేశ్వరుని దర్శించుకున్న పేర్నాటి .

నెల్లూరు .గుర్రపుస్వామి అంకాల పరమేశ్వరి అమ్మవార్లను తూర్పు రాయలసీమ పట్టభద్రులు ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాం ప్రసాద్ రెడ్డి దర్శించుకున్నారు.



ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయనందా రెడ్డి ఆహ్వానం మేరకు గంగాధర నెల్లూరు నియోజకవర్గం మరియు మండలంలోని అగరమంగలం గ్రామం, అంకాళిపురంలో వెలసి ఉన్న గుర్రపుస్వామి అంకాల పరమేశ్వరి అమ్మవార్లను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి మహాశివరాత్రి సందర్భంగా శనివారం దర్శించుకున్నారు.మహాశివరాత్రి శుభ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీర్వచనాలు అందజేశారు.తదుపరి ఆలయ ధర్మకర్త ఎంసీ విజయనందా రెడ్డి గారు కండువాతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని శ్యామ్ ప్రసాద్ రెడ్డి కి అందజేశారు.తదుపరి ఆలయ నిర్మాణ పనులను ఎంసీ విజయనందా రెడ్డితో కలసి సందర్శించారు.

# అసత్య కథనాలతో రైతుల ఆవేదన

విజయవాడ రూరల్ అసత్య కథనాలు ప్రచారం చేస్తున్నారంటూ పైడూరుపాడు రైతులు ఓ పత్రిక పై మండిపడ్డారు. రైతులకు మంచి చేయాలి కానీ,ఇబ్బందులకు గురిచేయరాదని అన్నారు. గత సంవత్సరం నుండి ధాన్యాన్ని బీఎస్ ఆగ్రో రైస్ మిల్లర్లకు అమ్ముతున్నాం. వాతావరణం ప్రతికూలంగా ఉండడంతో బీఎస్ ఆగ్రోస్ మిల్లుకు ధాన్యాన్ని అమ్మడం జరిగిందని,బిల్లులు చెల్లించడంలో జాప్యం జరిగుతుండడంతో తమకు న్యాయం జరిగేలా చూడమని రాజకీయనాయకుల దగ్గరికి వెళ్లామని అన్నారు. రైస్ మిల్లుకు తాము స్వచ్ఛందంగా ధాన్యాన్ని అమ్మితే రాజకీయనాయకుల ప్రమేయం అంటూ అసత్య ప్రచారాలు చేయడం తగదని రైతులు ఖండించారు.

# కోటప్పకొండకు తరలిస్తుండగా అదుపుతప్పి కిందపడిన విద్యుత్ ప్రభ

పల్నాడు పల్నాడు జిల్లా చిలకలూరిపేట కోటప్పకొండ తిరునాళ్ల వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది. చిలకలూరిపేట మండలంలోని బొప్పూడి గ్రామానికి చెందిన విద్యుత్తు ప్రభ కొండకు తరలిస్తుండగా అదుపుతప్పి పక్కకు ఒరిగి కింద పడిపోయింది. కోటప్పకొండ మార్గంలో మండలంలోని పోతవరం దాటిన తర్వాత ఈ ఘటన చోటుచేసుకుంది. అయితే ఇద్దరికీ స్వల్ప గాయాలు మినహా ఎటువంటి ప్రమాదము చోటు చేసుకోకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దీంతో ఆ మార్గంలో ట్రాఫిక్ నిలిచిపోగా పోలీసులు వెంటనే అప్రమత్తమై ఎక్కడికక్కడ క్రమబద్ధీకరించి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొనకుండా మార్గం సుగమం చేశారు.

# విషమంగా తారక రత్న ఆరోగ్యం

బెంగళూరు, ఫిబ్రవరి 18, తీవ్రమైన గుండెపోటుతో ఆస్పత్రిపాలైన నందమూరి తారకరత్న ఆరోగ్య అత్యంత విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించినట్లుగా సమాచారం అందుతోంది. ఇంతకాలం ఆయన కొలుకుంటున్నారని భావించినా.. ఇప్పుడు ఆయన ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారినట్లు తెలుస్తోంది. గత 23 రోజులుగా బెంగళూరులోని నారాయణ హృదయాలయలో చికిత్స పొందుతున్న తారకరత్నకు విదేశీ వైద్యులతో సైతం చికిత్స అందితస్తున్నారు. మధ్యలో కాస్త కోలుకున్నట్లు కనిపించినా.. మళ్లీ అదే పరిస్థితి నెలకొన్నట్లు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో మరికాసేపట్లో సాయంత్రం 4.30 గంటలకు తారకరత్న ఆరోగ్యానికి సంబంధించిన హెల్త్ బులెటిన్ విడుదల చేయనున్నట్లు వైద్యులు ప్రకటించారు. తారకరత్న ఆరోగ్యంపై కీలక ప్రకటన చేయనున్న నేపథ్యంలో బాలకృష్ణ, తారకరత్న కుటుంబ సభ్యులు బెంగళూరు చేరుకున్నారుకాగా, టీడీపీ యువ సారధి నారా లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్ర ప్రారంభం రోజున జనవరి 27న నందమూరి వారసుడు, సినీ నటుడు తారకరత్న కూడా పాల్గొన్నారు. పాదయాత్రలో భాగంగా లోకేష్ తో కలిసి నడుస్తుండగా.. తీవ్రమైన గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. వెంటనే ఆయనను కుప్పంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం అక్కడి నుంచి బెంగళూరులోని నారాయణ హృదాయలకు తరలించారు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. విదేశాల నుంచి కూడా వైద్యలును రప్పించి చికిత్స అందించారు. కానీ, ఆయన ఆరోగ్యంలో ఎలాంటి మెరుగుదల కనిపించలేదు.

# అందరం కలిస్తే...బీజేపీకి కష్టమే

పాట్నా, ఫిబ్రవరి 18, 2024 సార్వత్రిక ఎన్నికల్లో విపక్షాల ఐక్యత కోసం బీహార్ సీఎం, జేడీయూ చీఫ్ నితీష్ కుమార్ ప్రయత్నిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ మళ్లీ అధికారంలోకి రాకుండా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. 2024 ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్ హా అన్ని ప్రతిపక్షాలు చేతులు కలపాలని కోరారు. యునైటెడ్ ఫ్రంట్ బీజేపీని 100 కన్నా తక్కువ సీట్లకు పరిమితం చేయగలదని అన్నారు. కాంగ్రెస్ తో పాటు విపక్షాలు హాజరైన ఓ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.కాంగ్రెస్ పార్టీ త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. వారు నా సూచనను స్వీకరించి కలిసి పోరాడితే బీజేపీని అధికారానికి దూరం చేయవచ్చని, ఒక వేళ ఈ సూచనను తీసుకోకుంటే ఏం జరుగుతుందో మీకు తెలుసని నితీష్ కుమార్ అన్నారు. పాట్నాలో జరిగిన సీపీఐ-ఎం 11వ మహాసభలో ఆయన మాట్లాడుతూ, తనకు ప్రధానమంత్రి కావాలనే ఆశలు లేవని, ఆ పదవికి పోటీదారునని కూడా మరోసారి పునరుద్ఘాటించారు. దేశాన్ని ఏకం చేయడం, విద్వేషానలు వ్యాప్తి చేసే వ్యక్తుల నుంచి విముక్తి చేయడమే తన ఆశయం అని.. నాకు ఇంకేం వద్దని మేము మీతో ఉంటామని నితీష్ కుమార్ అన్నారు.ఈ కార్యక్రమంలో బీహార్ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్, కాంగ్రెస్ నేత సల్మాన్ ఖుర్షీద్, బీహార్ మాజీ సీఎం జీతన్ రామ్ మాంఝీ పాల్గొన్నారు. ఎన్డీయే కూటమిలో బీజేపీతో భాగస్వామిగా ఉన్న నితీష్ కుమార్ జేడీయూ, గతేడాది పొత్తును తెంచుకుని, లాలూ ప్రసాద్ యాదవ్ ఆర్జేడీతో అధికారాన్ని చేపట్టింది. అప్పటి నుంచి బీజే?పీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారు నితీష్ కుమార్. 2024 ఎన్నికల్లో ప్రతిపక్షాలు చేతులు కలిపితే..భారీ మెజారిటీతో గెలవవచ్చని పలుమార్లు సూచించారు.

# మంచి మార్గం క్రైస్తవ మతం

**ప్రసంగీకులు డాక్టర్ ఎలీషా**

కడప క్రైస్తవం అనేది ఒక మంచి మార్గమని ముఖ్య ప్రసంగీకులు బెంగళూరు కు చెందిన పాస్టర్ డాక్టర్ ఎలీషా అన్నారు. కడప నగరంలోని జయనగర్ కాలనీ లో వున్న ఐక్య ఆరాధన చర్చి లో హోలీ సీడ్ అండ్ ఫైనల్ కాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాస్టర్ మాణిక్యం పర్యవేక్షణలో గత మూడు రోజులుగా పాస్టర్లకు బైబిలు తరగతులు, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డా ఎలీషా మాట్లాడారు మానవుడు తన పాత పద్ధతిని వదిలి మంచి మార్గం లో నడిచేందుకు దేవుడు ఎంతో సమయాన్ని, అవకాశాన్ని ఇస్తాడని మారిన మనిషి రక్షింప బడతారని మారని మనిషి శిక్షింపబడతారని చెప్పారు. అనంతరం మరో ముఖ్య అతిథి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా చూడాలని హితవు పలికారు క్రైస్తవుల హక్కుల పరిరక్షణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని చెప్పారు. భారత దేశం లౌకిక, ప్రజాస్వామ్య దేశమని అందరితో పాటు క్రైస్తవులను సమానంగా చూడాలని చెప్పారు. క్రైస్తవ మిషనరీల ద్వారానే భారత దేశానికి విద్య, వైద్యం,కూడు ,గుడ్డ, గూడు, పేదలకు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యుఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్ళ బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు పెనుబాల ఓబులేసు, వైఎస్సార్ కడప ఇండిపెండెంట్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటపాటి ఫిలిప్ (సుబ్బారాయుడు) విజయవాడ కు చెందిన పాస్టర్ రాబర్ట్, రాబిన్, పాస్టర్లు మహేష్, రవితేజ, హేమంత్ కుమార్, ఫరూక్, అనిల్,తేజ, కిశోర్, తదితరులు పాల్గొన్నారు

# వక్ఫ్ బోర్డు సంరక్షణలో ఎ. ఎస్. పేట దర్గా

ఆత్మకూరు... ( ఫిబ్రవరి 18 శనివారం ).నెల్లూరు జిల్లా ఎ. ఎస్. పేట మండల కేంద్రంలోని రహమతాబాద్ దర్గా ముతవల్లి అసిఫ్ పాషాను పదిరోజుల పాటు భాద్యతల నుండి తొలగిస్తున్నట్లు కుటుంబ సభ్యులకు నోటీసును అందించిన స్టేట్ వక్ఫ్ బోర్డు అధికారులు వచ్చిన అభియోగాలపై విచారణ కమిటీని నియమించారు. కమిటీ ఇచ్చిన నివేదిక అనంతరం స్టేట్ వక్ఫ్ బోర్డు తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు స్టేట్ వక్ఫ్ బోర్డ్ అసిస్టెంట్ సీఈవో నూరుల్లా తెలిపారు. ప్రస్తుతం జిల్లా వక్ఫ్ అధికారుల నేతృత్వం లో దర్గా నిర్వహణ జరుగుతుందన్నారు స్టేట్, జిల్లా వక్ఫ్ బోర్డ్ దర్గాను సందర్శించారు. దర్గాకు కు సంబంధించిన రూముల వివరాలను, వస్తు సామాగ్రి వివరాలు సేకరించారు దర్గా లో పనిచేస్తున్న ప్రస్తుత సిబ్బంది యధావిధిగా తమ నిధులు నిర్వహిస్తారని విచారణ కమిటీకి అందరూ పూర్తిగా సహకరించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డ్ ఇన్స్పెక్టర్ ఆడిటర్ షేక్. అహ్మద్ బాషా, డిప్యూటీ సెక్రటరీ షేక్. నూర్ సాహెబ్, దర్గా ఈవో సూపరిండెంట్ షేక్. మహమ్మద్ హుస్సేన్, జూనియర్ అసిస్టెంట్ మహమ్మద్ ఇమ్రాన్, షేక్. ఖుదావర్ వక్ఫ్ బోర్డ్ ఇన్స్పెక్టర్ ప్రకాశం జిల్లా, ఖాజా మస్తాన్ ఇన్స్పెక్టర్ల ఆడిటర్, షేక్. ఇమ్రాన్ హెడ్ ఆఫ్ జీడి ఆఫీస్, షేక్. నజీర్ స్టేట్ ఆఫీస్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తజనకోటితో నిండిన శివాలయాలు



బద్వేలు ,మహాశివరాత్రి సందర్భంగా శనివారం బద్వేల్ నియోజకవర్గం లోని ఏడు మండలాల్లో పలు శివాలయాలు భక్త జనకోటితో నిండిపోయాయి తెల్లవారుజాము నుంచే కుటుంబాలతో సహా భక్తులు శివాలయాలకు రావడం మొదలుపెట్టారు మహాశివరాత్రి పురస్కరించుకొని శివాలయాలకు నిర్వాకులు దేవాదాయ శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు ప్రతి శివాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు బద్వేల్ పట్టణంలోని రూపారం పేట శివాలయం మండలంలోని వనంపుల శివాలయం భక్తులతో నిండిపోయింది వనంపుల శివాలయం అతి పురాతనమైనదని చెప్పాలి చెన్నంపల్లె శివాలయం భక్తులతో నిండిపోయింది తెలుగుదేశం పార్టీ నాయకుడు బాలరాజు యాదవ్ ఈ ఆలయంలో శివపార్వతుల కళ్యాణం జరిపించారు కళ్యాణ మహోత్సవంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు ఈ ఆలయం వద్దనే పెద్ద ఎత్తున అన్న ప్రసాదం నిర్వహించారు బి కోడూరు మండలం మేకవారిపల్లె శివాలయం తోపాటు గోపవరం మండలం మల్లెం కొండేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి ఈ ఆలయం కింది భాగంలో భక్త జనకోటికి పలువులు భక్తాదులు అన్నప్రసాద వితరణ చేశారు ఈ కార్యక్రమం ఆదివారం కూడా ఉంటుందని నిర్వాకులు తెలిపారు లంక మల్ల అభయారణ్యంలో వెలసి ఉన్న లంక మల్లేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి మహోత్సవాలు వైభవంగా జరిగాయి బద్వేల్ కు కేవలం 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న లంక మల్లేశ్వర స్వామి ఆలయం త్రేతా యుగంలో స్వయంగా శ్రీరామచంద్రుడు కట్టించినట్లు చరిత్రకారులు చెబుతారు పకృతి రమ్మనీయంతో కూడిన ఈ అభయారణ్యం ప్రపంచంలోనే అరుదైన ఎర్రచందనం వృక్షాలకు ప్రసిద్ధి ఈ ఆలయానికి వెళ్లేందుకు మహాశివరాత్రి పర్వదినాల్లో మాత్రమే బద్వేలు ఆర్టిసి డిపో వారు ప్రత్యేక బస్సులు నడుపుతారు శివరాత్రి పర్వదినం సందర్భంగా పలువురు రాజకీయ ప్రముఖులు అధికారులు

### శివపార్వతుల కళ్యాణ మహోత్సవాలు అన్న ప్రసాదాల వితరణ
### రాజకీయ ప్రముఖులు అధికారులు శివాలయాల సుదర్శన



శివాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు అలాగే పలు శివాలయాల్లో శివపార్వతుల కళ్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి స్వామివారి కళ్యాణ మహోత్సవంలో వందలాదిమంది భక్తులు పాల్గొన్నారు ఆలయాలకు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు ఆలయాలకు వచ్చిన భక్తులకు భక్తులు రాత్రి జాగారం చేశారు పలు ఆలయాల వద్ద హరికథలు బుర్రకథలతోపాటు వీరబ్రహ్మేంద్రస్వామి నాటకాలు వేశారు మహాశివరాత్రి వేడుకలు భక్తులను రంజింప చేశాయని చెప్పాలి ఈసారి జరిగిన మహాశివరాత్రి వేడుకలు గతంలో ఎప్పుడు కూడా జరగలేదని చెప్పవచ్చు

## తుగ్గలిలో ఘనంగా యాగంటీశ్వరుని, పెద్దమ్మల కలశ ప్రతిష్టలు

### శివరాత్రి పర్వదినాన యాగంటీశ్వరునికి అభిషేకం,హోమాలు నిర్వహణ.

తుగ్గలి: మండల కేంద్రమైన తుగ్గలిలోని యాగంటీశ్వర దేవాలయం నందు భక్తులు శనివారం రోజున శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు.శనివారం రోజున ఉదయం యాగంటీశ్వర దేవాలయం నందు గంగపూజ ను నిర్వహించి,కలశాలతో గుడి చుట్టూ ప్రదక్షనలను నిర్వహించారు.అనంతరం కళశాలకు పూజలను నిర్వహించి గణపతి హోమం మరియు రుద్ర హోమాలను అర్చకులు నిర్వహించారు.అనంతరం యాగంటీశ్వరునికి భక్తులు అభిషేకాలను నిర్వహించారు.చివరిగా అర్చకులు యాగంటీశ్వరునికి అలంకరణ నిర్వహించి మహా మంగళ హారతిను ఇచ్చి భక్తులకు పంపిణీ చేశారు.అనంతరం యాగంటీశ్వర దేవాలయం గోపురం పైన, పెద్దమ్మ దేవాలయం పైన కలశాలను ప్రతిష్టించారు.మండల వ్యాప్తంగా ఉన్న శివాలయాల నందు భక్తులు శివునికి అభిషేకాలను నిర్వహించి ఉపవాస దీక్షలతో మొక్కులను తీర్చుకున్నారు.మండల కేంద్రమైన తుగ్గలిలో శివరాత్రి జాగరణ సందర్భంగా అర్ధరాత్రి గ్రామంలో నందికోలు సేవను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

# జిల్లాస్థాయి చదరంగం పోటీల విజేతలు

నంద్యాల ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఆల్ కర్నూల్ చెస్ అసోసియేషన్ నిర్వహణలో రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో నిర్వహించిన నంద్యాల జిల్లా స్థాయి 19 సంవత్సరాల లోపు బాల బాలికల చదరంగం పోటీల విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. బహుమతి ప్రధానోత్సవంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ,రామకృష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుబ్బయ్య, లయన్స్ క్లబ్ కోశాధికారి రత్న కుమార్ అతిథులుగా పాల్గొని విజేతలకు ట్రోఫీలు,పతకాలు అందజేశారు.విజేతల వివరాలు :బాలికల విభాగంలో వరుసగా ఆళ్లగడ్డ కు చెందిన రిషితాబాయి,భారతి, నంద్యాల కు చెందిన చాహత్ ప్రథమ,ద్వితీయ,తృతీయ స్థానాలు సాధించగా,నాలుగో స్థానంలో వెలుగోడు కు చెందిన దీక్ష శ్రీ ,బాలుర విభాగంలో వరుసగా నంద్యాలకు చెందిన హర్షవర్ధన్ ఆచారి,ఆళ్లగడ్డ కు చెందిన జ్యోతిష్ రెడ్డి,మాన్విత్ నాయక్ ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించగా, నాలుగో స్థానంలో మహమ్మద్ ఫర్హాన్ నిలిచి బహుమతులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి రామసుబ్బారెడ్డి ఆర్బిటర్లు ఇమామ్ ,సుజాత పాల్గొన్నారు.

# చంద్రబాబుపై మంత్రులు ఫైర్

విజయవాడ, ఫిబ్రవరి 18,తెలుగుదేశం అధినేత చంద్రబాబు తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో చోటు చేసుకున్న పరిణామాలపై అధికార వైసీపీ ఘాటుగా రియాక్ట్ అవుతోంది. అసలు చంద్రబాబుకు ప్రజాస్వామ్యంపై నమ్మకమే లేదన్నారు మంత్రి చెల్లబోయిన వేణుగోపాల్. అందుకే అధికారులపై, అధికార పార్టీ నేతలపై చివరకు తనకు రక్షణగా ఉండే పోలీసులపై దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో పోలీసుల రాజ్యం కూడా కాదు రౌడీరాజ్యం నడుస్తుందని తెలుగుదేశం అధినేత చంద్రబాబు చేసిన కామెంట్స్‌పై వైసీపీ దాడి తీవ్రం చేసింది. చంద్రబాబుకు ప్రజాస్వామ్యంపై గౌరవం లేదన్నారు మంత్రి వేణుగోపాల్. ప్రతిపక్ష నాయుకుడు సైకోలా వ్యవహారిస్తున్నారని ధ్వజమెత్తారు. చట్టాలను ఎవరైనా గౌరవించాల్సిందేనంటూ కామెంట్ చేసిన మంత్రి... పోలీసుల పట్ల కూడా చంద్రబాబు దౌర్జన్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అశాంతిని సృష్టించేందుకు చంద్రబాబుతోపాటు తెలుగుదేశం నేతలు యత్నిస్తున్నారని విమర్శించారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఫ్రస్టేషన్‌లో చంద్రబాబు పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని విమర్శించారు మరో మంత్రి దాడిశెట్టి రాజా. గత ఎన్నికలతోపాటు ఎప్పుడు ఎలాంటి ఎన్నికలు వచ్చినా ప్రజలు బుద్ధి చెబుతున్నా చంద్రబాబుకు అర్థం కావడం లేదన్నారు. భవిష్యత్‌లో కూడా అదే సీన్ రిపీట్ అవుతుందన్నారు. శుక్రవారం చంద్రబాబు నాయుడు తూర్పుగోదావరి జిల్లాలోని అనపర్తి వెళ్లేందుకు యత్నించడం సభకు అనుమతి లేదని పోలీసులు అడ్డుకోవడం తెలిసిందే తర్వాత ఆయన పాదయాత్రగా ఏడు కిలోమీటర్లు వెళ్లి సభలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ... సహాయ నిరాకరణ చేస్తున్న ప్రతి పోలీసును గుర్తుపెట్టుకుంటామని హెచ్చరించారు. సీఎం జగన్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని చంద్రబాబు అన్నారు. వైసీపీ ప్రభుత్వ అంతానికి ఇది ప్రజాతిరుగుబాటు అన్నారు. పోలీసులు దారి ఇవ్వకపోతే ముందుకు దూసుకెళ్తామన్నారు. ఎంతమందిపై కేసులు పెడతారో చూస్తామన్నారు. రౌడీరాజ్యం అంతం చేసేందుకు కౌంట్‌డౌన్ ప్రారంభం అయిందని చంద్రబాబు అల్టిమేటం జారీచేశారు. అనపర్తి దేవీ చౌక్ వద్ద పోలీసుల తీరుపై చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు సభ నిర్వహించకూడదని చెప్తూ విద్యుత్ సరఫరా నిలిపివేశారు. టీడీపీ కార్యకర్తల సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులో చంద్రబాబు ప్రసంగించారు. రాష్ట్రం కోసం ఎన్ని అవమానాలైనా భరిస్తానని చంద్రబాబు అన్నారు. అనపర్తిలో సభకు అనుమతి ఇచ్చి తర్వాత రద్దు చేశారని మండిపడ్డారు. జగ్గంపేట, పెద్దాపురం వెళ్తే పోలీసులు సహకరించారని, అనపర్తిలో గ్రావెల్ సూర్యనారాయణ వల్ల పోలీసులు ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఖబడ్దార్ గ్రావెల్ సూర్యనారాయణ, నాతో పెట్టుకుంటున్నావు అంటూ హెచ్చరించారు. జగన్ చెప్పినట్లు చేస్తే అధికారులు ఇబ్బంది పడతారని, తర్వాత నా దగ్గరే పనిచేయాలి గుర్తుపెట్టుకోవాలని పోలీసులను హెచ్చరించారు. పోలీసులు ఇవాళ ప్రవర్తించిన తీరుకు ఆ యూనిఫామ్ సిగ్గుపడుతుందన్నారు. అనపర్తి నుంచే పోలీసులకు సహాయక నిరాకరణ ప్రారంభించామని చంద్రబాబు ప్రకటించారు. పోలీసుల సరిగాలేదని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే మిమ్మల్ని కూడా జైల్లో పెట్టిస్తానన్నారు. ఎవరినీ వదిలిపెట్టనని హెచ్చరించారు. జగన్ పాదయాత్ర చేస్తున్నప్పుడు మా ప్రభుత్వం అడ్డుపడిందా అని ప్రశ్నించారు. అప్పుడు లేని ఆంక్షలను ఇప్పుడెందుకు అని నిలదీశారు. ఒక మాజీ సీఎంపై పోలీసులు ప్రవర్తించిన తీరు సరిగా లేదన్నారు. తానేమైనా పాకిస్థాన్ నుంచి వచ్చానా, ఎందుకు అడుగడుగునా అడ్డుపడుతున్నారని చంద్రబాబు ప్రశ్నించారు. టీడీపీ కార్యకర్తలను కొట్టడం పోలీసులకు మంచిది కాదన్నారు.

## భీమేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు

రామచంద్రపురం దక్షిణ కాశీ, పంచారామ క్షేత్రంగా పేరుగాంచిన ద్రాక్షారామ శ్రీ మణిక్యాంబ సమేత శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం మహాశివరాత్రి పురస్కరించుకొని భక్తులతో పోటెత్తింది. ఈ ఏడాది మహాశివరాత్రి నాడు శని త్రయోదశి మహాశివరాత్రి కలిసి రావడంతో అశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఇక్కడకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్సు తాగునీరు మజ్జిగ పాలు అన్నప్రసాదాలను ఏర్పాటుతోపాటు చలువ పందిర్లు కూడా ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. సప్త గోదావరిలో భక్తులు స్నానం ఆచరించి, స్వామివారిని దర్శించుకుని. తరించారు.మహాశివరాత్రి సందర్భంగా శ్రీ మాణిక్యంబ సమేత శ్రీ భీమేశ్వర స్వామి వారి ప్రత్యేక పూజల్లో రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

# మేనల్లుడి కెరీర్‌పై మెగాస్టార్ దృష్టి?



మెగా ఫ్యామిలీ నుంచి వచ్చి హీరోగా సక్సెస్ అయిన సాయి ధరం తేజ్ ఈమధ్య కెరీర్ లో వెనకపడ్డాడు అన్న మాట వాస్తవమే అని చెప్పొచ్చు. మారుతి దర్శకత్వంలో వచ్చిన ప్రతి రోజు పండగే తర్వాత సోలో బ్రతుకే సో బెటర్ రిపబ్లిక్ రెండు సినిమాలు నిరాశ పరిచాయి. ముఖ్యంగా రిపబ్లిక్ సినిమా టైంలో సాయి ధరం తేజ్ కి యాక్సిడెంట్ కావడం దాదాపు కోమా స్టేజ్ నుంచి బయట పడటం లాంటివి కెరీర్ పై ఎఫెక్ట్ పడేలా చేశాయి. ఇక ప్రస్తుతం సాయి ధరం తేజ్ విరూపాక్ష సినిమా చేస్తున్నాడు. సుకుమార్ అసిస్టెంట్ కార్తీక్ దండు డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా టీజర్ సినిమాపై క్రేజ్ వచ్చేలా చేసింది. సుకుమార్ కథ అందించిన ఈ సినిమా సాయి ధరం తేజ్ కెరీర్ కు చాలా ఇంపార్టెంట్. అందుకే మెగా ఫ్యామిలీ కూడా ఈ సినిమాపై స్పెషల్ ఇంట్రెస్ట్ చూపిస్తున్నట్టు తెలుస్తుంది. చిరంజీవి కూడా విరూపాక్ష సినిమా విషయంలో స్పెషల్ కేర్ తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. కథ విన్నప్పటి నుంచి చిరు తేజ్ సినిమాపై ఓ కన్ను వేసి ఉంచారని టాక్. సినిమా ఎలా వస్తుంది.. ఎలా తీస్తున్నారు అన్న విషయంపై కూడా చిరు ఫోకస్ చేస్తున్నారట.మేనల్లుడు కెరీర్ రిస్క్ లో పడకుండా తనకు ఈ సినిమా ఎలాగైనా హిట్ పడేలా చేసేందుకు మెగాస్టార్ కృషి చేస్తున్నారట. ఇక ఈ సినిమా తర్వాత ఎలాగు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తో వినోదయ సీతం రీమేక్ లో కూడా సాయి ధరం తేజ్ నటిస్తున్నాడని తెలిసిందే. ఇక ఎలాగు ఆ సినిమాలో పవన్ ఉంటాడు కాబట్టి దాని రేంజ్ వేరేలా ఉంటుంది. ఎటొచ్చి విరూపాక్ష సినిమాతోనే హీరోగా సాయి ధరం తేజ్ సోలోగా హిట్ కొట్టాలని చూస్తున్నాడు. యాక్సిడెంట్ తర్వాత ఇదివరకు ఉన్నంత దూకుడుగా కనిపించని సాయి ధరం తేజ్ సినిమాలతో అయినా పూర్వ వైభవం తెచ్చుకుంటాడా లేదా అన్నది చూడాలి. విరూపాక్ష ఓ ప్రయోగాత్మక సినిమా కాబట్టి తప్పకుండా మంచి ఫలితం వస్తుందని భావిస్తున్నారు. సినిమాను ఈ ఏడాది సమ్మర్ రిలీజ్ ఎ÷-లాన్ చేశారు. మళయాళ హీరోయిన్ సంయుక్త మీనన్ ఈ మూవీలో కథానాయికగా నటించింది.




# రీ ఎంట్రీ ఇస్తున్న నటి మీరా జాస్మిన్



నటి మీరా జాస్మిన్ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. పేరుకు మలయాళీనే అయినా తెలుగుతనం ఉట్టిపడే రూపం తనది. కెరీర్ బిగెనింగ్‌లో మీరాను చాలా మంది తెలుగు అమ్మాయే అనుకున్నారు. అంతలా తెలుగు వారికి దగ్గరైంది ఈ మలయాళ కుట్టి. 'చాలా బాగుంది' సినిమాతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన ఈ అమ్మడు మొదటి సినిమాతోనే మంచి క్రేజ్ తెచ్చుకుంది. ఆ తర్వాత వరుసగా 'గుడుంబా శంకర్', 'భద్రా సినిమాలతో స్టార్ హీరోయిన్‌ల సరసన చేరింది. ఈ రెండు సినిమాలతో మీరాకు ఎక్కడలేని క్రేజ్ వచ్చింది. దాంతో అవకాశాలు వరుసగా క్యూ కట్టాయి. ఆ అవకాశాలే మీరా కెరీర్ పతనం అవడానికి కారణమయ్యాయి.అవకాశాలు వస్తున్నాయి కదా అని అన్ని సినిమాలను ఒప్పేసుకుంది. తీరా అన్ని పరాజయాలు కాకపోవడంతో క్రమంగా చాన్స్‌లు తగ్గాయి. ఇక అదే సమయంలో మీరా పెళ్లి చేసుకుని సినిమాలను తగ్గించేసింది. కాగా ఈ మధ్య సోషల్ మీడియాతో తిరిగి మంచి క్రేజ్ తెచ్చుకుంది. హాట్ హాట్ ఫోటోలను షేర్ చేస్తూ యూత్ మతులు పోగొడుతుంది. ఇదిలా ఉంటే ఈ అమ్మడు దాదాపు పదేళ్ల తర్వాత మళ్లీ తెలుగులోకి రీ ఎంట్రీ ఇస్తుంది. 'విమానం' అనే తెలుగు-తమిళ బైలింగ్యువల్ సినిమాతో మీరా టాలీవుడ్‌లోకి రీ ఎంట్రీ ఇస్తుంది. జీ స్టూడియోస్, కిరణ్ కొర్రపాటి క్రియేటీవ్ వర్క్స్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులలో బిజీగా ఉంది.చివరగా తెలుగులో మీరా జాస్మిన్ 'మోక్ష' అనే సినిమాలో నటించింది. హర్రర్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కిన ఈ సినిమా 2013లో రిలీజైంది. శ్రీకాంత్ వేములపల్లి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో దిశా పాండే, నాజర్, రాహుల్ దేవ్ కీలక పాత్రల్లో నటించారు. దాదాపు పదేళ్ల తర్వాత తెలుగులో రీ ఎంట్రీ ఇస్తుండటంతో ప్రేక్షకుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది.

# నిప్పులు చెరిగిన బ్రాడ్.. ఓటమి దిశగా కివీస్




2 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడేందుకు న్యూజిలాండ్ గడ్డపై అడుగుపెట్టిన ఇంగ్లండ్ క్రికెట్ టీమ్.. మౌంట్ మాంగనూయ్ వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్‌లో (డే అండ్ నైట్) విజయం దిశగా సాగుతుంది.మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆతిథ్య జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 63 పరుగులకే సగం వికెట్లు కోల్పోయి ఓటమిని ఖరారు చేసుకుంది. ఇంగ్లండ్ పేసర్ స్టువర్ట్ బ్రాడ్ (10-5-21-4) నిప్పులు చెరగడంతో మూడో రోజు ఆఖరి సెషన్‌లో కివీస్ ఇన్నింగ్స్ పేకమేడలా కూలింది.న్యూజిలాండ్ గెలవాలంటే ఇంకా 331 పరుగులు చేయాల్సి ఉండగా.. చేతిలో 5 వికెట్లు మాత్రమే ఉన్నాయి. ఈ మ్యాచ్‌లో ఇంకా రెండు రోజుల ఆట మిగిలి ఉంది. క్రీజ్‌లో డారిల్ మిచెల్ (13),ర మైఖేల్‌బ్రేస్‌వెల్ (25) ఉన్నారు. బ్రాడ్ 4 వికెట్లతో విజృంభించగా.. రాబిన్సన్ ఓ వికెట్ తీసుకున్నాడు. న్యూజిలాండ్ సెకెండ్ ఇన్నింగ్స్‌లో లాథమ్ (15), డెవాన్ కాన్వే (2), విలియమ్సన్ (0), హెన్రీ నికోల్స్ (7), టామ్ బ్లండెల్ (1) దారుణంగా విఫలమయ్యారు. బ్రాడ్ పడగొట్టిన 4 వికెట్లు క్లీన్ బౌల్డ్ కావడం విశేషం.అంతకుముందు ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 374 పరుగులకు ఆలౌటైంది. రూట్ (57), హ్యారీ బ్రూక్ (54), ఫోక్స్ (51) హాఫ్‌సెంచరీలతో రాణించగా.. ఓలీ పోప్ (49), స్టోక్స్ (31), రాబిన్సన్ (39), జాక్ క్రాలే (28), బెన్ డక్కెట్ (25) పర్వాలేదనిపించారు. కివీస్ బౌలర్లలో టిక్నర్, బ్రేస్‌వెల్ చరో 3 వికెట్లు తీయగా.. వాగ్నర్, కెగ్గెలిన్ తలో 2 వికెట్లు పడగొట్టారు.దీనికి ముందు ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో చేసిన 325 పరగుల స్కోర్‌కు న్యూజిలాండ్ ధీటుగానే బదులిచ్చింది. టామ్ బ్లండెల్ (138) సెంచరీతో కదం తొక్కగా.. కాన్వే (77) హాఫ్ సెంచరీతో మెరిశాడు. ఇంగ్లండ్ బౌలర్లలో రాబిన్సన్ 4, ఆండర్సన్ 3, బ్రాడ్, జాక్ లీచ్, స్టోక్స్ చెరో వికెట్ పడగొట్టారు. డక్కెట్ (84), హ్యారీ బ్రూక్ (89) భారీ అర్థశతకాలతో చెలరేగడంతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌ను 325 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. వాగ్నర్ 4, సౌథీ, కుగ్గెలిన్ తలో 2, టిక్నర్ ఓ వికెట్ పడగొట్టాడు. మరో వికెట్ ఉండగానే ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190